ప్రజాశక్తి
గురువారం 6 మార్చి 2025 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా



నివేదికలతో కాలయాపన

- జల జీవన్ మిషన్ పనుల్లో మార్పులు
- తాజాగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు ఒకే ప్రణాళిక
- ఇంటింటికీ కుళాయి పనుల్లో మరింత జాప్యం

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

జల జీవన్ మిషన్ (జెజెఎం) పథకం మళ్లీ మొదటి కొచ్చింది. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఈ పథకంలో ప్రాధాన్యతలు మారిపోతున్నాయి. గత ప్రభుత్వ హయాంలోని పనులను పక్కన పెట్టిన టిడిపి కూటమి ప్రభుత్వం మరో సమగ్ర నివేదిక (డిపిఆర్)ను సిద్ధం చేసింది. తాజాగా ఈ నివేదికలోనూ మార్పులు సూచించింది. రూరల్ ప్రాంతాలతోపాటు అర్బన్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రేడియంట్ కన్సల్టెన్సీ కంపెనీ నివేదికలు సిద్ధం చేస్తోంది. దీంతో ప్రతి ఇంటికీ కుళాయి నీరు పంపిణీలో మరింత జాప్యం జరిగే పరిస్థితి ఏర్పడింది.

ఈ పథకం ద్వారా ఉమ్మడి కృష్ణాజిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో రోజుకు ఒక్కో మనిషికి సగటున 55 లీటర్లు ఉపరితల జలాలను సరఫరా చేయడానికి కన్సల్టెన్సీ కంపెనీ నివేదికలు సిద్ధం చేసింది. గ్రామీణ ప్రాంతాలకు రోజుకు 145 మిలియన్ లీటర్లు (ఎంఎల్‌డి) సరఫరాకు రూ.6,093 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేసింది. ఈనివేదికను ప్రభుత్వానికి పంపి టెండర్లు పిలవడానికి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు సిద్ధమవుతున్న సమయంలో ప్రభుత్వం ఈ పథకంలో పలు మార్పులను సూచించింది. ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాల్లో జరిగే పనులను ఆర్‌డబ్ల్యుఎస్, పట్టణ ప్రాంతాల పనులను ప్రజారోగ్య విభాగం విడివిడిగా పర్యవేక్షిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాలకు జల జీవన్ మిషన్ ద్వారా, పట్టణ ప్రాంతాలకు అమృత స్కీం కింద కేంద్రం నిధులు అందిస్తోంది. తాజాగా రూరల్, అర్బన్ (మిగతా 2లో)

ఖాళీ ప్లేట్లతో వెటర్నరీ విద్యార్థుల నిరసన

మెస్ మూసివేతపై ఆందోళన



విద్యార్థులతో మాట్లాడుతున్న సిఐ శివప్రసాద్

ప్రజాశక్తి-గన్నవరం

భోజనం పెట్టకుండా హాస్టల్ మెస్‌కు తాళాలు వేయడంపై వెటర్నరీ విద్యార్థులు మండిపడ్డారు. న్యాయమైన సమస్య కోసం ఆందోళన చేస్తుంటే మెస్ మూసివేస్తారా.. మా కడుపు మాడుస్తారా.. మాపై ఉక్కుపాదం మోపుతారా... అంటూ బుధవారం వెటర్నరీ కళాశాలలోని విద్యార్థులు ఖాళీ ప్లేట్లు, గ్లాసులతో నిరసన తెలిపారు. మెయిన్ గేటుకు తాళాలు వేసి సిబ్బందిని లోనికి రానీయకుండా అడ్డుకున్నారు. దీంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. గన్నవరం సీఐ శివప్రసాద్ తన సిబ్బందితో రంగంలోకి దిగి విద్యార్థి నాయకులతో మాట్లాడినా సమస్య సర్దుబాటు కాలేదు. స్టైఫండ్ పెంచాలంటూ గత 30 రోజులుగా విద్యార్థులు నిరసన దీక్ష చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని విద్యార్థి నాయకులు చెప్పారు. మంత్రులకు చెప్పినా తమ గోడు పట్టించుకున్న నాథుడు లేడని మండిపడ్డారు. తమ సమస్యలు నెరవేర్చకపోగా హాస్టల్ నుంచి బయటికి తోసేసారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు దిగివచ్చి తమ సమస్యకు పరిష్కారం చూపే వరకు గేటు తాళాలు తీయమంటూ భీష్మించుకు కూర్చున్నారు. దీంతో సిఐ ఒక్కసారిగా అగ్రహానికి లోనయ్యారు. సిఎం కాన్వాయ్ వస్తోంది. రోడ్డుమీద ట్రాఫిక్ ఆగిపోయింది. కాన్వాయ్ ఆగితే సమస్య పెద్దదవుతుంది. అదే జరిగితే విద్యార్థులపై కేసులు పెట్టాల్సి వస్తుంది. మీరు వెంటనే గేటు తాళాలు తీసి సిబ్బందిని లోపలకు పంపాలని ఆదేశించారు. ఆ వెంటనే కళాశాల అధ్యాపకులు, ప్రిన్సిపాల్ రంగంలోకి దిగి విద్యార్థులతో మాట్లాడి పరిస్థితిని సర్దుబాటు చేశారు. గేటుకు తాళాలు తీయడంతో బయట ఉన్న సిబ్బంది లోపలకు వెళ్లిపోయారు.

మినుము రైతు దిగాలు

- గత సీజన్‌లో క్వింటా రూ.9,100
- నేడు రూ.7,800కు వ్యాపారుల కొనుగోలు
- కృష్ణాలో 2,79,947 ఎకరాల్లో సాగు
- ఆందోళనలో రైతులు, కౌలు రైతులు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

మార్కెట్ ఒడిదుడుకులు రైతులను కుంగదీస్తున్నాయి. ఈ సీజన్‌లో మినుము పంట సాగుకు పెట్టుబడి వ్యయం భారీగా పెరిగింది. తీరా పంట చేతికొచ్చే సమయానికి మినుముల ధర భారీగా తగ్గిపోయింది. ఈ పంటపై రైతులు, కౌలు రైతులు పెట్టుకున్న ఆశలు ఆవిరయ్యాయి. నవంబర్ రెండో వారం నుంచి డిసెంబర్ రెండో వారం వరకు వరి మాగాణుల్లో రెండో పంటగా రబీలో మినుము అత్యధికంగా 2 లక్షల 79 వేల 947 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేశారు. 80 నుంచి 90 రోజుల కాల వ్యవధిగల ఈ పంట నూర్పిడిని సాధారణ రైతులు వేగవంతం చేశారు. సగటున ఎకరాకు 4.5 క్వింటాళ్ల చొప్పున మొత్తం 11 లక్షల 24 వేల 761 క్వింటాళ్లు దిగుబడి వస్తుందని అంచనా. అయితే పంట చేతికొచ్చే సమయానికి మార్కెట్‌లో ధర దారుణంగా తగ్గిపోయింది. గతేడాది సీజన్‌లో క్వింటా రూ.9,100 ధర పలకగా ప్రస్తుతం వ్యాపారులు రూ. 7,800కు మాత్రమే రైతుల నుంచి కొంటున్నారు. గతేడాదితో పోల్చితే క్వింటా మినుములకు మార్కెట్‌లో రూ.1300 ధర తగ్గిపోయింది. దీంతో ఆర్థిక అవసరాలకు



విక్రయిస్తున్న రైతులు ఎకరాకు 4.5 క్వింటాళ్లకు రూ. 5,850 చొప్పున ఆదాయాన్ని కోల్పోతున్నారు.

కౌలు రైతుల్లో కలవరం

ఈ ఏడాది మినుము పంటలకు తెగుళ్లు, పురుగులు అధికమవ్వడంతో సస్యరక్షణ, సాగుకు ఎకరాకు రూ.23 వేల నుంచి 25 వేలకుపైగా వ్యయం చేశారు. తీరా పంట చేతికొచ్చే సమయానికి ధర తగ్గిపోయింది. ఖరీఫ్‌లో వరి, రబీలో మినుము దిగుబడులు ఆధారంగానే వ్యవసాయ భూములకు ఎకరాకు 18 బస్తాల నుంచి 23 బస్తాల వరకు కౌలు చెల్లిస్తారు. మొదటి పంట వరి (మిగతా 2లో)



6-3-2025 గురువారం
ఇఫ్తార్ (సాయంత్రం) : 6.20
7-03-2025 శుక్రవారం
సహర్ (ఉదయం) : 5.03

'చలో విజయవాడ'పై ఉక్కుపాదం

- హాజరుకావొద్దని పోలీసుల హెచ్చరికలు
- ఆశా వర్కర్లు, సిఐటియు నేతలకు నోటీసులు
- ఫోన్లలో బెదిరింపులు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి, విజయవాడ

తమ న్యామమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్లు గురువారం తలపెట్టిన 'చలో విజయవాడ'ను అడ్డుకునేందుకు ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. వివిధ రూపాల్లో వారిని భయపెట్టేందుకు ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి పలువురిని పోలీసుల ద్వారా నోటీసులు జారీ చేసింది. ఆశా వర్కర్ల ఉద్యమాన్ని అణచివేయడానికి పూనుకుంది. దీనిలో భాగంగా ధర్నాకు ప్రభుత్వ అనుమతి లేని కారణంగా కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లోని ఆశా వర్కర్స్ యూనియన్ నేతలకు, సిఐటియు నాయకులకు ముందస్తు నోటీసులు జారీ చేసింది. 'చలో విజయవాడ'కు వెళొద్దని, ఇళ్ల వద్దే ఉండాలని పలువురు నేతలకు పోలీసులు నోటీసులు ఇచ్చారు. పోలీసులు ఫోన్లు చేసి బెదిరిస్తున్నారు. కార్యక్రమానికి అనుమతిలేనందున వెళ్లొద్దని, వెళితే ఇబ్బందుల్లో పడతారని హెచ్చరిస్తున్నారు. చట్ట ప్రకారం అండర్ సెక్షన్ 168 బిఎన్ఎస్ఎస్ ప్రకారం చర్యలు (మిగతా 2లో)



సిఐటియు నేతలకు నోటీసులిస్తున్న పోలీసులు

8 నుంచి పి4 సర్వే

... వార్త 2లో

స్థానిక సమస్యలు వివరించిన ఎంఎల్ఏలు

... వార్త 6లో

8 నుంచి పి4 సర్వే

- పేదల అవసరాలు గుర్తింపు
- ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ



ప్రజాశక్తి-విజయవాడ

పేదరికం లేని సమాజ నిర్మాణం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్ (పి4) సర్వేకు రూపకల్పన చేయడం జరిగిందని, ఈ నెల 8వ తేదీ నుంచి 18వ తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా సర్వే జరుగుతుందని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. బుధవారం ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లతో వర్చువల్‌గా పీ4 సర్వేపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ నెల 6, 7 తేదీల్లో రెండు రోజుల పాటు మాస్టర్ ట్రైనర్లుగా ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు తమ పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి సర్వేపై పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. టెక్ మాడ్యూల్‌తో పాటు సర్వే విధానాన్ని క్షుణ్ణంగా వివరించాలన్నారు. పేదరికాన్ని దూరం చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికాయుతంగా చేపడుతున్న కార్యక్రమాలకు అదనంగా సామాజికంగా, ఆర్థికంగా పైన ఉన్న కుటుంబాలు సామాజిక బాధ్యతగా అట్టడుగున ఉన్న కుటుంబాలకు మద్దతుగా నిలిచేలా ప్రోత్సహించడం పి4 విధానం లక్ష్యమని వివరించారు. పేదల అవసరాలను గుర్తించి వారి సమగ్రాభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టుల రూపకల్పనకు ఈ సర్వే దోహదం చేస్తుందన్నారు. కుటుంబాలు ప్రస్తుతం అందుకుంటున్న పథకాలపై ఈ సర్వే ఎలాంటి ప్రభావం చూపదని స్పష్టం చేశారు. సర్వే ద్వారా సేకరించిన డేటా ఆధారంగా ఇంటి అవసరాలకు అనుగుణంగా సమర్థవంతమైన ప్రణాళికల రూపకల్పనకు వీలవుతుందన్నారు. ఈ సమాచారాన్ని కుటుంబాలకు వివరించి కుటుంబ వివరాలతో పాటు వివిధ సామాజిక, ఆర్థిక పరామితుల ఖచ్చితమైన సమాచారాన్ని యాప్‌లో పొందుపరచాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కుటుంబాలకు ఏవైనా అపోహలు ఉంటే తొలగించి, సర్వేను పది రోజుల్లో పూర్తిచేయాల్సి ఉంటుందన్నారు. అన్ని సమన్వయ శాఖల సమిష్టి భాగస్వామ్యంతో సర్వేను విజయవంతంగా పూర్తి చేసేందుకు క్షేత్రస్థాయి అధికారులు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీపీవో వై.శ్రీలత, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, జిల్లా పరిశ్రమల అధికారి బి. సాంబయ్య, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

నివేదికలతో కాలయాపన

ప్రాంతాలకు ఒకే నివేదికను సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆయా శాఖలకు సూచించింది. అర్బన్ ప్రాంతాల్లో రోజుకు ఒక్కొక్కరికి 135 లీటర్ల నీటిని సరఫరా చేయాల్సి ఉంది. అందుకు అనుగుణంగా ప్రజారోగ్య విభాగం, రేడియంట్ కన్సల్టెన్సీ కంపెనీ నివేదికలు సిద్ధం చేసే పనిలో ఉన్నాయి.

కృష్ణాలో 1858 జెజెఎం పనులు రద్దు

గత ప్రభుత్వ హయాంలో కృష్ణాజిల్లాలో రూ.976 కోట్లా 62 లక్షల 22 వేల విలువైన 2,313 జల జీవన్ పనులకు టెండర్లు పిలిచారు. వీటిలో 1,858 పనులను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. మిగిలిన 455 పనులను కొనసాగిస్తోంది. వీటిలో రూ.91 కోట్లా 55 లక్షల 52 వేల విలువైన 274 పనులు పూర్తికావచ్చాయి. పూర్తయిన 129 పనులకు రూ.10 కోట్లా 43 లక్షల 81 వేల వరకు బిల్లులు చెల్లించారు.

కృష్ణాలో కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సిన గృహాలు 1,67,224

జిల్లాలో మొత్తం 3,84,128 గృహాలు ఉన్నాయి. వీటిలో 2,17,004 గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. ఇంకా 1,67,224 గృహాలకు కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది.

మినుము రైతు దిగాలు

దిగుబడిలో కౌలు చెల్లించగా కౌలు రైతుకు చిల్లిగవ్వ మిగలదు. కేవలం రెండో పంట మినుము దిగుబడి, ధర ఆధారంగానే కౌలు రైతులకు రెక్కల కష్టం మిగులదని వాపోతున్నారు.

మార్కెట్‌లో ధర వస్తుందని చూస్తున్నా

గుంటక కృష్ణారెడ్డి, తుట్టగుంట ఉంగుటూరు మండలం

ఎనిమిది ఎకరాల వ్యవసాయం చేస్తున్నా. ఎకరాకు 25 వేలు పైగా ఖర్చయింది. కాటా పెడితే గానీ ఎన్ని క్వింటాళ్ల అవుతాయో తెలవదు. ప్రస్తుతం అమ్ముదామంటే ధర తగ్గిపోయింది. గత ఏడాది క్వింటా రూ. 9,100 అమ్మాం. ఈ ఏడాది క్వింటా రూ. 7,800 అడుగుతున్నారు. ఇంటి దగ్గరే నిల్వ ఉంచా. మార్కెట్‌లో ధర వస్తుందని చూస్తున్నా.

రెక్కల కష్టం మిగలదు

చింతలపూడి రామయ్య, కౌలు రైతు, తుట్టగుంట

నాలుగున్నర ఎకరాలు కౌలుకు సాగు చేస్తున్నా. మొదటి పంట కౌలు చెల్లించడానికే సరిపోయింది. ఎకరాకు 5 క్వింటాళ్లు చొప్పున 22.5 బస్తాలు దిగుబడి వచ్చింది. మినుము సాగుకు ఎకరాకు రూ. 25 వేలు పెట్టుబడి పెట్టా. మినుము రేటు తగ్గిపోయింది. కౌలు రైతులకు రెక్కల కష్టం మిగలదు.

'చలో విజయవాడ'పై ఉక్కుపాదం

తీసుకుంటామని చెబుతున్నారు. 'మీ నాయకుల ఫోన్ నెంబర్లు చెప్పండి' అంటూ దబాయిస్తున్నారు. కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీపట్నంతోపాటు రెండు జిల్లాల్లోని పలు మున్సిపాల్టీలు, గ్రామీణ ప్రాంతాల్లో ఆశా వర్కర్లకు కూడా నోటీసులు అందించారు. సిఐటియు కృష్ణాజిల్లా నాయకులు బూర సుబ్రహ్మణ్యం, మచిలీపట్నం నగర కార్యదర్శి సిహెచ్.జయరావు, ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు పలువురికి నోటీసులు అందించారు. అలాగే ఎన్‌టిఆర్ జిల్లాలో విజయవాడ భవానీపురం, హౌసింగ్ బోర్డు కాలనీ, వాంబేకాలనీ, రూరల్ పరిధిలోని కంచికచర్ల, నందిగామ, జగ్గయ్యపేట తదితర ప్రాంతాల్లోని యూనియన్ నేతలకు పోలీసులు ఫోన్లు చేశారు. పోలీసుల నుండి ఎన్ని వత్తిడులు, బెదిరింపులు ఎదురైనా 'చలో విజయవాడ'ను విజయవంతం చేస్తామని నేతలు స్పష్టం చేస్తున్నారు.



ఉపకార వేతనాలు అందిస్తున్న ఎంఎల్ఎ కుమార్‌రాజా

ఉపకార వేతనాలు పంపిణీ

ప్రజాశక్తి-పమిడిముక్కల : విద్యార్థులు బాగా చదువుకొని అభివృద్ధిలోకి రావాలని పామర్రు ఎంఎల్ఎ వర్ల కుమార్ రాజా అన్నారు. బుధవారం తాడంకి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సిద్ధార్థ అకాడమీ అందజేసిన ఉపకార వేతనాలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని విద్యార్థు లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపకార వేతనాలు అందజేసిన దాత లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘాలకు కాల్వ పనులు అప్పగించాలి

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ నియోజక వర్గంలోని కాలువల్లో నీరు ప్రవహించే పనులు నీటి సంఘాలకే అప్పగించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము బుధవారం అసెంబ్లీలో ప్రస్తావిం చారు. ఈ సందర్భంగా అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ కాలువల్లో నీరు సక్రమంగా ప్రవహించే పనులు నీటి సంఘాలకే అప్పగిస్తే రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఈ సంద ర్భంగా ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు సభలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే 60 వేల మంది రైతుల భాగస్వామ్యంతో తిరిగి నీటి సంఘాలను పునరుద్ధరించినట్లు తెలిపారు.

అందరి సమన్వయంతో మహిళా దినోత్సవానికి ఏర్పాట్లు

- ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ

ప్రజాశక్తి-విజయవాడ: ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో వేడుకల నిర్వహణకు సంబంధించి దిశానిర్దేశం చేసేందుకు రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రివర్యులు గుమ్మిడి సంధ్యారాణి బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వేడుకల నిర్వహణకు సూచనలు చేశారు. ప్రభుత్వ దార్శనికతకు అనుగుణంగా వివిధ శాఖల సమష్టి భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. వీసీ అనంతరం కలెక్టర్ లక్ష్మీశ.. డీఆర్‌డీఏ, మెప్మా, వైద్య ఆరోగ్యం, స్త్రీ, శిశు సంక్షేమం, పరిశ్రమలు తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి, శాఖల వారీగా కార్యాచరణను వివరించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయం మొదలు, రాష్ట్ర స్థాయి వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందని.. ఎన్‌టీఆర్ జిల్లాస్థాయి కార్యక్రమం నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. గౌరవ ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంలో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. వివిధ శాఖల పరిధిలో మహిళాభివృద్ధికి అమలవుతున్న పథకాలు, కార్యక్రమాలపై మహిళలను జాగృతం చేసి.. వాటిని సద్వినియోగం చేసుకునేలా ముందుకు నడిపించేందుకు స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేక అవగాహన ర్యాలీల నిర్వహణకూ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, పీవో-యూసీడీ వెంకటరత్నం, డీఎంహెచ్‌వో డా.ఎం.సుహాసిని, డా.ఎన్‌టీఆర్ వైద్యసేవ సమన్వయకర్త డా. జె.సుమన్, ఐసీడీఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి, జిల్లా పరిశ్రమల అధికారి బి.సాంబయ్య, ఏసీపీ కె.లతాకుమారి, ఎల్‌డీఎం కె.ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

లైంగిక దాడులకు పాల్పడితే చర్యలు



ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లా వైద్యాధికారి డా. శర్మిష్ఠ ఆధ్వర్యంలో చిన్నారులపై లైంగిక దాడులు నివారణపై క్షేత్రస్థాయి అధికారులకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా పాల్గొన్న ఎన్టీఆర్ జిల్లా ఆర్బీఎస్ కె సైకాలజిస్ట్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మంచి స్పర్శ, చెడు స్పర్శపై పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు తల్లిదండ్రులు అవగాహన కల్పించాలని అన్నారు. కృష్ణాజిల్లా ఆర్బీఎస్కే సమన్వయకర్త డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు బాలికలను లైంగికంగా వేధించినా, చిన్నారులపై అత్యాచారంతో పాటు మైనర్లపై దాడులకు పాల్పడే వారిపై పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఆర్బీఎస్కే వైద్యాధికారి డాక్టర్ శ్వేత మాట్లాడుతూ పుట్టుక నుండి 18 సంవత్సరాల లోపు మానసిక శారీరక లోపాలు కలిగిన బాలబాలికలకు ఆర్బీఎస్కేలో అందించే సేవలను గురించి వివరించి, ప్రత్యేక అవసరాలు కలిగిన బాలబాలికలు ఈ సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. కృష్ణాజిల్లా చైల్డ్ వెల్ఫేర్ చైర్ పర్సన్ కె. సువర్ణ, డి పి వో సత్యవతి, జిల్లాలోని మండల విద్యాధికారులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఉద్యోగుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగుల ఫెడరేషన్ జేఏసీ ఆధ్వర్యంలో తమ సమస్యలు వారు గురువారం మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. డిసెంబర్ 20, 2023 తేదీన సమ్మె ప్రారంభించామని ప్రభుత్వంతో సమ్మె ఒప్పందాలు జరిగిన తర్వాత జనవరి 10, 2024 తేదీన సమ్మె విరమించామని, నేటి వరకు ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపలేదని తెలిపారు. కీలకమైన అంశాలు హెచ్.ఆర్.పాలసీ అమలుకు కమిటీ, మినిమం ఆఫ్ టైం స్కేల్, వేతనాలు పెంపు, ఈపీఎఫ్ అమలు, ప్రభుత్వ ఉద్యోగాలలో వెయిటేజీ, కారుణ్య నియామకాలు, నిర్దిష్టమైన జాబు చార్ట్, పదవి విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంపు, గ్రాట్యూటీ అమలు ఇతర ముఖ్య విషయాలు పెండింగ్ లో ఉన్నాయన్నారు. వీటి పరిష్కారం కోసం పలుమార్లు వినతి పత్రం ఇచ్చినప్పటికీ ప్రభుత్వం నుండి ఎలాంటి చర్యలు లేవని అన్నారు. మార్చి 11వ తేదీన విజయవాడ కేంద్రంలో నిరసన దీక్ష చేయాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించిందన్నారు. ఈ ఆందోళనలో జాన్ మోజీ, పోతురాజు, రాకేష్, హరి ప్రసాద్, నాగబాబు, ప్రబోధ, ప్రసాద్, నిరుపమ, తదితరులు పాల్గొని తెలిపారు.

రుద్రపాటికి ఘన నివాళి

ప్రజాశక్తి మోపిదేవి : మండలంలోని కప్తాను పాలెంలో గుండెపోటుతో మృతిచెందిన ప్రముఖ దళిత నాయకులు, అంబేద్కర్ అభిమాని, రుద్రపాటి వెంకటేశ్వరావుకు పెదప్రోలు సర్పంచ్ పోలిమెట్ల ఏసుబాబు, తెలుగుదేశం నాయకులు బుధవారం ఘనంగా నివాళులర్పించారు. రావి నాగేశ్వరావు రత్నగిరి, పెదప్రోలు సొసైటీ అధ్యక్షులు నాదెళ్ల బుజ్జి,టీడీపీ నాయకులు డోకిపర్తి బాలకోటేశ్వరావు, అంబేద్కర్ అభిమాని దాసి సీతారామరాజు తదితరులు వెంకటేశ్వరావు చేసిన సేవలను కొనియాడారు.

యువకుడి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-చల్లపల్లి : మొవ్వ మండల పరిధిలోని కాజ సమీపంలో ఐనంపూడి డ్రయిన్లో యువకుడి మృతదేహం లభ్యమైనట్లు కూచిపూడి ఎస్సై సుబ్రమణ్యం తెలిపారు. పోలీసులు అందించిన సమాచారం ప్రకారం కాజకు చెందిన రాజులపాటి రాజేష్ (27) కాలువలో శవమై కనిపించడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించగా వారు వచ్చి వివరాలు సేకరించారు. మృతుడిపై కూచిపూడి పోలీస్ స్టేషన్లో పలు కేసులు ఉన్నట్లు తెలిపారు. హత్యా లేక ఆత్మహత్యా అనే కోణంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండు వైన్ షాపుల లైసెన్సులు రద్దు

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : పెడన మండలం బల్లిపర్రు గ్రామంలోని దేవి వైన్స్, చేవేంద్రపాలెం లోని ఆదిత్య వైన్ షాపుల లైసెన్సులను రద్దు చేశామని ఎక్సైజ్ శాఖ మచిలీపట్నం ఇన్స్పెక్టర్ ప్రకాష్ తెలిపారు. బెల్ట్ దుకాణాలకు సరుకు సరఫరా చేస్తూ పట్టుబడటంతో ఆ షాపుల లైసెన్స్ రద్దు చేసి సీజ్ చేశామని ప్రకటించారు. పెడన మండల ప్రాంతంలోని స్థానికుల సమాచా రంతో కూడిన ఫిర్యాదులు వస్తే బెల్ట్ షాపు నిర్వాహ కులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ప్రతిఒక్కరికీ ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి-ఘంటసాల : రైస్ కార్డులో ఉన్న ప్రతి ఒక్కరూ తప్పని సరిగా ఈకేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ తెలిపారు. ఘంటసాల తహసీల్దార్ కార్యాలయం వద్ద రేషన్ డీలర్ల సమావేశం బుధవారం సాయంత్రం నిర్వహిం చారు. ఈ సందర్భంగా పీడీఎస్ డీటీ కొడాలి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ డీలర్లు తమ పరిధిలోని రైస్ కార్డులో ఉన్న కుటుంబ సభ్యులందరి చేత ఈకేవైసీ చేయించాలన్నారు. కార్డుదారులు కూడా డీలర్లు ఈకేవైసీ కొరకు వచ్చినప్పుడు సహకరించాలని, కార్డులో ఉన్న ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించు కోవాలని ఈ కార్యక్రమాన్ని నెలాఖరులోపు డీలర్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్ఐ కె.శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ చైతన్య లక్ష్మీ, పాల్గొన్నారు.



7 నుండి రైతుల ముసాయిదా జాబితా ప్రదర్శన

ప్రజాశక్తి - తిరువూరు : ఇ - పంట నమోదు చేయించుకున్న రైతుల ముసాయిదా జాబితాను సామాజిక తనిఖీ నిమిత్తం ఈ నెల 7 నుండి 11వ తేదీ వరకు రైతు సేవా కేంద్రాల్లో, గ్రామ సచివాలయల్లో ప్రదర్శించనున్నట్లు వ్యవసాయ సహాయక సంచాలకులు (ఎడిఎ) జి.కెనడి తెలిపారు. తిరువూరు మండల చుట్టేల గ్రామంలో వ్యవసాయ శాఖ మండల అధికారి పి.పద్మ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అనంతరం వ్యవసాయ మండల కార్యాలయంలో రైతులకు పంటసాగులో నష్టాలు సంభవించినప్పుడు నష్టపోకుండా ప్రభుత్వం నుండి వచ్చే బీమా సౌకర్యం గురించి కెనడి రైతులకు వివరించారు. ఈ పంట నమోదులో సాగు వివరాలను సంబంధిత రైతులు ఇప్పటికే నమోదు చేయించుకున్న వారి జాబితాను గ్రామాల్లో ప్రదర్శించనున్నట్లు చెప్పారు. జాబితాలో రైతు పేరు, పంట రకం, పంట పేరు, విత్తిన తేదీ, నీటి వసతి తదితర వివరాలు సరిచూసుకుని ఏవైనా అభ్యంతరాలు ఉంటే వారి రైతు సేవా కేంద్ర సిబ్బందికి రాత పూర్వకంగా అందజేయాలన్నారు. తుది జాబితా 22న ప్రదర్శించబడుతుందన్నారు. తుది జాబితా ప్రదర్శించిన తరువాత ఎటువంటి మార్పులు చేయబడవని వివరించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది కె.కోటేశ్వరి, కె.భాగ్య లక్ష్మి రైతులు పాల్గొన్నారు.

మిక్‌లో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న దాత

ప్రజాశక్తి - కంచికచర్ల : స్థానిక మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ ఎన్ఎస్ఎస్ విభాగం, ఆంధ్రా బ్లడ్ బ్యాంక్, అమెరికన్ కేన్సర్ కేర్ బ్లడ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో బుధ వారం కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వంశీ కిరణ్ తెలిపారు. ఈ శిబిరంలో దాదాపు 126 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా రక్త దానం చేసి వారి సామాజిక స్పృహను తెలిపారు. ప్రతి ఏటా 200 మందికి పైగా మిక్ విద్యార్థులు ఈ అత్యవసర సమయంలో రక్తదానం చేసి ఎంతో మంది ప్రాణాలను కాపాడారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిఇఒడి పాండు రంగారావు, మేనేజ్‌మెంట్ మెంబర్ ఎం.సుహాస్, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి.రాజేష్, విద్యార్థులు, ఆధ్యాపకులు, ఆంధ్రా హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్. కామినేని అచ్యుతబాబు, అమెరికన్ కేన్సర్ కేర్ మేనేజర్ మురళి మోహన్‌రావు, శంకరరావు పాల్గొన్నారు.

బేటి బచావో -బేటీ పడావో

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పొట్టి శ్రీరాములు చలువాది మల్లికార్జున రావు ఇంజనీరింగ్ కళాశాలలో బేటి బచావో -బేటీ పడావో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా బేటి బచావో - బేటీ పడావో కార్యక్రమంలో ఐసీడీస్ సూపర్వైజర్ ప్రశాంతి , ఐ సి పి ఎస్ జిల్లా కార్యదర్శి జాన్సన్, టాటా ట్రస్ట్ గాయత్రి ఆధ్వర్యంలో హ్యూమన్ ట్రాఫికింగ్, ఫోక్సో యాక్ట్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 50 వ డివిజన్ అంగన్ వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

లేపాక్షి క్లియరెన్స్ సేల్‌ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : దేశవ్యాప్తంగా ఎంతోమంది హస్త కళాకారుల చేతిలో రూపుదిద్దుకున్న అద్భుతమైన కళాఖండాలపై లేపాక్షి వార్షిక క్లియరెన్స్, ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా ప్రత్యేకమైన డిస్కౌంట్లతో వినియోగదారులు కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ సంస్థ లేపాక్షి హ్యాండీ క్రాఫ్ట్స్ అమ్మకాలు ప్రారంభించిందని లేపాక్షి మేనేజర్ ఎం.సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీనగర్‌లోని షోరూమ్‌లో హస్తకళ వస్తువులు, చేనేత వస్త్రాలపై 10 నుంచి 50 శాతం తగ్గింపు ధరలతో కళాకృతులు కొనుగోలు చేసేందుకు, హస్త కళాకారులకు ఉపాధి కల్పించేందుకు వచ్చిన ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొండపల్లి, ఏటికొప్పాక, ఉడ్ కార్వింగ్ కళారూపాలు, చేనేత వస్త్రాలు, మంగళగిరి కాటన్, కలంకారి వస్త్రాలపై ప్రత్యేక తగ్గింపు ధరలో కొనుగోలు చేసేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఎపిహెచ్‌డిసి మేనేజింగ్ డైరెక్టర్ ఎం.విశ్వ ఆదేశాల మేరకు ప్రత్యేక కలెక్షన్లతో ఈ క్లియరెన్స్ సేల్ వినియోగదారులకు ఒక మంచి షాపింగ్ అనుభూతిని కలగజేస్తుందన్నారు. మార్చి 31 వరకు తగ్గింపు ధరలో విక్రయాలు ఉంటాయని తెలిపారు. మరెక్కడా లభించని అరుదైన కళాకృతుల కొనుగోలుకు కళారాధకులు, వినియోగదారులు తమ అభిరుచులకు అనుగుణంగా కోరుకునే ప్రతి కళాకృతి వినియోగదారులను ఆకట్టుకునేలా ఉంటుందన్నారు. కళాత్మక అభిరుచులు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మేనేజర్ సురేష్ కోరారు.


విక్రయించేందుకు ఏర్పాటు చేసిన పలు రకాల వస్తువులు

7న సిద్ధార్థ స్వర్ణోత్సవాల ప్రారంభ సభ

లోగో ఆవిష్కరించిన యుజిసి చైర్మన్ జగదీష్ కుమార్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అందరికీ విద్య అందించే ఉన్నత లక్ష్యంతో సిద్ధార్థ విద్యాసంస్థలను స్థాపించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవాల ప్రారంభసభ ఈ నెల 7న నిర్వహిస్తున్నామని, ముఖ్య అతిథిగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ చైర్మన్ ప్రొఫెసర్ మమిడాల జగదీష్ కుమార్ (ఢిల్లీ) విచ్చేస్తున్నారని సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ పాలకవర్గం అధ్యక్షులు మలినేని రాజయ్య తెలిపారు. బుధవారం ఉదయం పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 7 నుంచీ ఈ డిశంబరు వరకు స్వర్ణోత్సవాల్లో భాగంగా నెలనెలా పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని, పోస్టల్ కవర్ ఆవిష్కరస్తామని, ప్రత్యేక పోస్టల్ స్టాంపు విడుదల చేస్తామని చెప్పారు. 1975 ఆగస్టు 12 న సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ 250 మంది జీవితసభ్యులతో ఏర్పాటయిందని, తొలుత 300 మంది విద్యార్థులతో 25 మంది అధ్యాపకులతో ప్రారంభమైన సిద్ధార్థ ప్రస్థానం ప్రస్తుతం 18 సంస్థలుగా విస్తరించిందని, 30 వేల మంది విద్యార్థులతో 3 వేల 500 మంది అధ్యాపకులతో లాభరహితంగా, ఉత్తమబోధన, విలువలతో కూడిన ఉన్నతవిద్య అందించే లక్ష్యంతో విజయవంతంగా సాగుతోందన్నారు. కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, సంయుక్త కార్యదర్శి నిమ్మగడ్డ లలితప్రసాద్ మాట్లాడుతూ విద్యారంగానికే సిద్ధార్థ పరిమితం కాకుండా కళా, సామాజిక రంగాలకు కూడా విస్తరించిందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ఉత్తమ కళాకారులను ప్రోత్సహించేందుకు 1990లో ముమ్మనేని సిద్ధార్థ కళాపీఠం స్థాపించి రాష్ట్రంలోనే కళా ప్రదర్శనల అత్యుత్తమ వేదికగా నెలవారీ సాంస్కృతిక కార్యక్రమాలతో తీర్చిదిద్దామన్నారు. సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ డీమ్డ్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ పి.వి.రావు మాట్లాడుతూ 7న యూజీసీ చైర్మన్ మమిడాల జగదీష్ కుమార్ కానూరులో అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ భవనాలకు భూమిపూజ చేస్తారని, వై.వి.రావు సిద్ధార్థ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభిస్తారని, సాయంత్రం నాలుగున్నరకు పి.బి.సిద్ధార్థ కళాశాల కళావేదికపై జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని స్వర్ణోత్సవాల లోగో ఆవిష్కరిస్తారని, టీజర్ విడుదల చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అకాడమీ సంయుక్త కార్యదర్శి సూరెడ్డి విష్ణు, సిద్ధార్థ హయ్యర్ ఎడ్యుకేషన్ డీమ్డ్ వర్సిటీ ప్రో ఛాన్సలర్ ఆచార్య రత్నప్రసాద్, పి.బి. సిద్ధార్థ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ పాల్గొన్నారు.


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వక్తలు

నిబంధనలకు విరుద్ధంగా అధికలోడుతో టిప్పర్లు

మామూళ్ల మత్తులో అధికారులు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ నియోజకవర్గంలో తరచూ వార్తల్లో అధికలోడుతో ప్రయాణిస్తున్న వాహనాలు వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రసార మధ్యమాల్లో వార్తలు వస్తున్నప్పటికీ కనీసం వాటిపై నందిగామ నియోజవర్గ రోడ్డు రవాణా సంస్థ అధికారులు దృష్టి సారించడం లేదు. నందిగామలో అధికలోడుతో ప్రయాణిస్తున్న వాహనాలపై చర్యలు శూన్యం. రోడ్డు రవాణా సంస్థ అధికారులు ఎక్కడ తనిఖీ చేయడం లేదు. రోడ్డు రవాణా సంస్థ అధికారులు అసలు ఉన్నారా?? వారు పని చేస్తున్నారా?? అని సందేహంలో ఉన్న నందిగామ నియోజకవర్గ ప్రజల్లో అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ఈ విధంగా అధిక లోడుతో ప్రయాణిస్తున్న వాహనాలపై చర్యలు తీసుకోపోతే భవిష్యత్తులో కొత్తగా వేసిన రోడ్లు దెబ్బ తినే ప్రమాదం ఉంది. అధిక లోడుతో ప్రయాణిస్తున్న వాహనాలను నియంత్రించలేకపోతే ఎన్నో పెను ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. నందిగామ నియోజకవర్గ రోడ్డు రవాణా శాఖ అధికారులకు ఇలాంటి వాహనాలపై అవగాహన ఉన్నా తమ నెలవారి మామూళ్ల మత్తులో చూసి చూడనట్టు వదిలేస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిన్న రాత్రి సరైన పత్రాలు లేని దొనబండ క్వారీ నుంచి వస్తున్న లారీని మైనింగ్ అధికారులు సీజ్ చేసి కంచికచర్ల పోలీసు వారికి అప్పగించారు. కనీసం ఇన్వాయిస్, వే బిల్లులు కూడా తనిఖీ చేయలేని పరిస్థితిలో నందిగామ నియోజకవర్గ రోడ్డు రవాణాశాఖ అధికారులు ఉన్నారు. ఇదంతా నందిగామ నియోజకవర్గ రోడ్డు రవాణా శాఖ అధికారుల నెలవారి మామూళ్ల వల్ల... ?? లేక వారి పనితీరులో లోపమా అని నందిగామ నియోజకవర్గ ప్రజల్లో సందేహం నెలకొంది.


నందిగామలో ఓవర్ లోడుతో టిప్పర్లు


అంత్యాక్షరి నిర్వహిస్తున్న దృశ్యం

సందడిగా సరాగాలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా బుధవారం కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో ఎస్‌కె పివి హిందూ హైస్కూల్స్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంత్యాక్షరి పోటీ ఆద్యంతం సరదాగా, సందడిగా సాగింది. హిందూ హైస్కూల్ కమిటీ అనుబంధ విద్యాసంస్థల్లోని మహిళా ఉద్యోగులకు నిర్వహించిన ఈ పోటీల్లో మొత్తం 15 జట్ల నుంచి 150 మంది మహిళలు పాల్గొన్నారు. అలనాటి పాత చిత్రాల నుంచి ఈనాటి చిత్రాల వరకు వచ్చిన పాటల్ని మహిళలు గానం చేసి ప్రతిభను ప్రదర్శించారు. బహుమతి ప్రధానోత్సవ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న హిందూ హైస్కూల్స్ కమిటీ అధ్యక్షుడు టి.శేషయ్య మాట్లాడుతూ మహిళల్లో అనంతమైన ప్రతిభ దాగి ఉందని, వారిని ప్రోత్సహిస్తే ఊహించని విజయాలు సాధిస్తారని అన్నారు. తమ గ్రూప్ సంస్థల్లో 70 శాతం మంది మహిళా ఉద్యోగులే ఉన్నారని చెప్పారు. కెబిఎన్ కళాశాల కార్యదర్శి డాక్టర్ టి.శ్రీనివాసు, చిట్టూరి హైస్కూల్ అధ్యక్షుడు ఆనంద రామ సుధాకర్, కార్యదర్శి సామ మణికంఠ, హిందు హై స్కూల్ కమిటీ కోశాధికారి గోళ్ళ బాబా విజయ్ కుమార్, కమిటీ సభ్యులు మద్ది సుబ్బారావు, ఉసిరిక ఉమామహేశ్వరరావు, డోగిపర్తి సుజాత తదితరులు పాల్గొన్నారు. కమిటీ సభ్యులు మాడుగుల వరప్రసాద్, గుండా గంగాధర్ పోటీలు నిర్వహించారు.

ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభం

ప్రజాశక్తి - తిరువూరు : శ్రమదినాల్లో దీక్షలు చేపట్టిన క్రైస్తవ విశ్వాసులు దైవధ్యానంతో గడపాలని తిరువూరు సహాయ మాత విచారణ గురువు రెవరెండ్ పాదర్ జంగం విజయకుమార్ అన్నారు. బుధవారం తిరువూరు ఆర్సీఎం చర్చిలో భస్మ బుధవారం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 రోజుల పవిత్ర దినాల్లో క్రైస్తవ విశ్వాసులు సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. తిరువూరు విచారణ పరిధిలోని సంఘాల నుంచి 200 మంది శ్రమ దినాల దీక్షలు చేపట్టారు. వారికి మాలధారణ చేయించి దీక్షాకాలంలో పాటించాల్సిన నియమాలను ఫాదర్ జంగం విజయకుమార్ వివరించారు.

విద్యుద్ఘాతంతో కేబుల్ ఆపరేటర్‌కు గాయాలు

ప్రజాశక్తి - జి కొండూరు : మండలంలోని చెవుటూరు గ్రామంలో కేబుల్ టీవీ లైన్లు మరమ్మతులు చేస్తుండగా కేబుల్ టీవీ ఆపరేటర్ విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. చెవుటూరు గ్రామంలో కొన్ని సంవత్సరాలుగా అనుప్ అనే వ్యక్తి కేబుల్‌ను నిర్వహిస్తున్నాడు. బుధవారం కేబుల్ లైన్ ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న విద్యుత్ స్తంభంపై ఎక్కి మరమ్మతులు చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అనూప్ కుడి చేయి కాలిపోయి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు బాధితుడిని మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ తరలించారు.



9న గన్నవరంలో బాలోత్సవం

ప్రజాశక్తి-గన్నవరం : ఈనెల తొమ్మిదవ తేదీన గన్నవరం బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో బాలోత్సవం పిల్లల పండుగ 2025 కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు గన్నె వెంకట్రావు, కర్రా వరప్రసాద్ తెలిపారు. ముఖ్య అతిథిగా గన్నవరం నియోజకవర్గ శాసన సభ్యులు యార్లగడ్డ వెంకట్రావు, అతిథులుగా జిల్లా పరిషత్ సీఈవో కె. కన్నమ నాయుడు, డీఈవో పి.వి.జె. రామారావు, గన్నవరం డివిజన్ డిఎస్పి చలసాని శ్రీనివాస రావు, గుడివాడ డివైఈవో కొండా రవి కుమార్ తదితరులు హాజరవుతారని తెలిపారు. గన్నవరం ఉంగుటూరు బాపులపాడు మండలాల్లోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులు పాల్గొంటారు.



మాట్లాడుతున్న కలెక్టర్ డికె బాలాజీ

మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా) : మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని జిల్లాలో ఆ రోజు వేడుకలు ఘనంగా నిర్వహించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని తన ఛాంబర్ లో ఆయన జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి మెప్మా, డి ఆర్ డి ఏ, ఐసిడిఎస్, మైనారిటీ, పోలీసు, మున్సిపల్, వైద్య ఆరోగ్య తదితర శాఖల అధికారులతో జిల్లాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సాధికారతను చాటేలా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు ఆయా శాఖలు సమన్వయంతో కషి చేయాలన్నారు. వివిధ రంగాలలో విజయం సాధించిన మహిళలకు తగిన గౌరవం, గుర్తింపు ఇచ్చే విధంగా ఆ రోజున వారికి సన్మానాలు, అదేవిధంగా వారిచేత ప్రేరణాత్మక అనుభవాలను పంచుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వేడుకల్లో ఆయా శాఖలకు సంబంధించిన స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో బందరు డిఎస్పి చప్పిడి రాజా, మెప్మా పీడీ సాయిబాబు, నగర మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, డి ఎం ఎన్ హెచ్ ఓ డాక్టర్ శర్మిష్ఠ, ఐసిడిఎస్ పిడి ఎంఎన్ రాణి, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ ఆర్ వెంకట్రావు, సెర్ప్, మైనారిటీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళల ముందంజ

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : స్వాతంత్ర్యానంతరం మహిళలకు దేశం అన్ని రంగాల్లో పెద్దపీట వేసిందని, మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ముందజంలో ఉన్నారని కృష్ణా విశ్వవిద్యాలయం రెక్టర్ ఆచార్య ఎంవి బసవేశ్వరరావు అన్నారు. మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఉమెన్ ఎంపవర్మెంట్ విభాగం ఆధ్వర్యంలో నిత్యం మహిళలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యల పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సు లో ఆయన పాల్గొని ప్రసంగించారు. 50 ఏళ్ల కిందటే భారత దేశాన్ని ఉక్కు మహిళ గా పేరుగాంచిన ఇందిరా గాంధీ సుదీర్ఘ కాలం పరిపాలించిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. దేశాన్ని సస్యశ్యామలం చేస్తున్న నదులను గంగా, యమునా, సరస్వతి, గోదావరి, కష్ణా నదులను తల్లులుగా పూజించడం మన సంస్కతి కి నిదర్శనమన్నారు.ప్రముఖ ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ సాహితీ స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలు వాటికి



పరిష్కారాలు గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం డా. సాహితీ ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆచార్యులు, సహాయ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలి

ప్రజాశక్తి-విజయవాడ : వేసవి వేడిని దష్టిలో ఉంచుకొని ప్రభుత్వ కార్యాలయాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని, మజ్జిగను కూడా సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు.వేసవి కార్యాచరణపై క్షేత్రస్థాయి అధికారులతో కలెక్టర్ లక్ష్మీశ బుధవారం కలెక్టరేట్ నుంచి వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ శాఖల అధికారులు తమ కార్యాలయ సిబ్బందితో పాటు సందర్శకులకు వేసవి కార్యాచరణలో భాగంగా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. వడదెబ్బ తగిలే పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు. జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని.. ఈ విషయమై ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు ప్రత్యేకంగా దష్టిసారించాలని ఆదేశించారు. చలివేంద్రాల కార్యకలాపాలను నిరంతరం సమీక్షించాలని, ఒక్క మనుషులకే కాదు.. పశుపక్ష్యాదులకూ తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. బస్టాండ్లు, ఆసుపత్రులు, రహదారుల కూడళ్ల తదితరాల వద్ద తప్పనిసరిగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు ఎండ తీవ్రత కారణంగా వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇప్పటినుంచే గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. వడదెబ్బ చికిత్సలకు సంబంధించి ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు.సమావేశంలో సీపీవో వై.శ్రీలత, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, జిల్లా పరిశ్రమల అధికారి బి. సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి- గుడ్లవల్లేరు : క్రైస్తవుల పవిత్ర ఉపవాస దినాలను పురస్కరించుకుని క్రైస్తవ దీక్షలు బుధవారం స్థానిక సంత రోడ్‌లోని మౌంట్ కార్మెల్ చర్చి(ఆర్‌సిఎం) చర్చిలో విచారణ గురువు ఫాదర్ మాథ్యూ నిరాకల్, సహాయ గురువులు ప్రతాప్ దివ్యబలిపూజలను నిర్వహించి దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా 120 మంది భక్తులు క్రైస్తవ (నాజీర్ వ్రత) దీక్షలు స్వీకరించారు. అనంతరం ఫాదర్‌లు మాట్లాడుతూ నేటి నుండి గుడ్‌ఫ్రైడే వరకూ 40 రోజుల పాటు ప్రపంచంలోని క్రైస్తవులందరూ ఉపవాసాలతో పవిత్రంగా ఉంటూ శ్రమదినాలు పాటిస్తారన్నారు. మండలంలోని 22 గ్రామాల నుండి 650 మంది ఈ ప్రార్థన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.**ప్రజాశక్తి - గుడివాడ :** మానవునిలోని చెడును పారద్రోలేందుకే క్రైస్తవ ఉపవాస దీక్షలని, ప్రతిఒక్కరు క్రీస్తును పోలి జీవించాలని ఫాదర్ గుజ్జుల మైఖేల్, శ్రీకాంత్‌లు అన్నారు. ప్రపంచంలోని క్రైస్తవుల శ్రమదినాలు(లెంట్ డేస్) పవిత్ర ఉపవాస దినాలను పురస్కరించుకుని క్రైస్తవ దీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. స్థానిక ఏలూరురోడ్‌లోని మౌంట్ కార్మెల్ చర్చి(ఆర్‌సిఎం)చర్చిలో విచారణ గురువు ఫాదర్‌గుజ్జుల మైఖేల్, సహాయ గురువులు జాన్‌హరిష్‌లు దివ్యబలిపూజలను నిర్వహించి దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా 500 మంది భక్తులు క్రైస్తవ (నాజీర్ వ్రత) దీక్షలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఫారీష్ కమిటీ చైర్మన్ ఏలేటి విలియం జోషి, సభ్యులు కారే శ్రీనివాసరావు, జీవరత్నం, ఇంటి స్వామిదాసు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక వివి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల, అసోసియేషన్ ఆఫ్ ఫార్మసీ అసోసియేషన్ ప్రొఫెషనల్ అనుసం ధానంతో ఈనెల 6వ తేదీన అంతర్జాతీయ సదస్సును గుడ్లవల్లేరు బీఫార్మసీ కళాశాలలో ఏర్పాటు చేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ లక్ష్మణరావు బుధవారం తెలిపుతూ బ్రోచర్ను ఆవిష్కరించారు. ఈ సదస్సు గ్లోబల్ బనారియో, ఫ్యూదర్ ప్రాస్పర్స్ ఆఫ్ డ్రగ్ డిజైన్ ఇన్ ఫార్మసిటికల్ సైన్సెస్ అనే అంశంపై నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఎపిపి అధ్యక్షులు ప్రొఫెసర్ రాజీవ్ దహియా, గౌరవ అతిథిగా ఎపిపి వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సి.వి సురేష్, రిసోర్స్ పర్సన్స్ గా ప్రొఫెసర్ కె ఎన్ బి రావు, ఈ సదస్సుకు వివిధ కళాశాలల నుండి అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు మరియు పారిశ్రామికవేత్తలు దాదాపు 450 మంది పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌తోపాటు విభాగాధిపతులు డాక్టర్ ఎస్.కె అమీనాబి, డాక్టర్ పి రవీష, డాక్టర్ టి ప్రశాంతి, డాక్టర్ టి బాలకష్ణ, మరియు బి సత్య శ్రీ పాల్గొనగా ఈ సదస్సుకు కోఆర్డినేటర్ గా డాక్టర్ పి రవిశ వ్యవహరిస్తారని తెలిపారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

పెయింటర్‌కు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - గుడివాడ : ఇటీవల కాలంలో గుడివాడ 12వ వార్డు నైజంపేట నివాసి షేక్ హుస్సేన్ బేగ్ అనే కార్మికుడు గుడివాడ ఆటోనగర్లో పెయింటర్‌గా పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు చేతి గూడు జారి ప్రమాదానికి గురవ్వడంతో రూ.10వేలు ఆర్థిక సాయం అందించినట్లు సిఐటియు పట్టణ కార్యదర్శి టి. లక్ష్మణరావు తెలిపారు. బుధవారం ది కష్ణాజిల్లా ఇండస్ట్రియల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం ఆటోనగర్ కమిటీ గుడివాడ వారి ఆధ్వర్యంలో బాధిత కార్మిక కుటుంబానికి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు అబ్దుల్ హమీద్ అలియాస్ అమీర్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కుద్దుస్, నాయకులు బొబ్బరపల్లి ఆంజనేయులు, ఎండి రషీద్ బేగ్, ఎస్.కె మొహిద్దీన్ భాష, కల్వకుంట నాగరాజు, ఎస్‌కె కాజా పాల్గొన్నారు.



శిరోమణికి 'ఉమెన్ ఆఫ్ ఎక్సలెన్స్-2025' జాతీయ పురస్కారం



ప్రజాశక్తి-గన్నవరం : కృష్ణాజిల్లా గన్నవరం మండలం కేసరపల్లి దుర్గాపురం గ్రామానికి చెందిన హిందీప్రచారక్, ఎపి ఎన్ఆర్ఐ విభాగం ఉద్యోగి సగ్గుర్తి నాగశిరోమణి నారీరత్న 'ఉమెన్ ఆఫ్ ఎక్సలెన్స్-2025' జాతీయ పురస్కారానికి ఎంపిక య్యారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరిం చుకొని ఈనెల తొమ్మిదో తేదీన విజయవాడ గాంధీనగర్‌లో జరిగే మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె పురస్కారాన్ని అందుకోనున్నారు. శ్రీశ్రీ కళావేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

సిఎల్‌బి సైన్స్ టాలెంట్ పరీక్షల్లో 'త్రివేణి' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - గుడివాడ : ఇటీవల హైదరబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి 15వ సిఎల్‌బి సైన్స్ టాలెంట్ పరీకక్షలలో త్రివేణి ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు ర్యాంక్‌లు సాధించి సత్తా చాటినట్లు త్రివేణి స్కూల్ ప్రిన్సిపల్, డైరెక్టర్ నిమ్మగడ్డ శివశంకర్ అన్నారు. బుధవారం స్థానిక పాటిమిద త్రివేణి స్కూల్‌లో రాష్ట్రస్థాయి సైన్స్ టాలెంట్ పరీక్షలలో స్కూల్స్ తరుపున పాల్గొన్న విద్యార్థులు ర్యాంక్‌లు సాధించిన సందర్భంగా విద్యార్థులకు అభినందన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన కె.అస్మికకు స్టేట్ 3వ ర్యాంక్, ఎస్. సిరివధనకు స్టేట్ 9వ ర్యాంక్, జె.మనీష్ శ్రీనివాస్‌కు 9వ ర్యాంక్ సాధించారన్నారు.

ఘనంగా ఎనిమిదో వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లిలోని శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి క్షేత్ర ఎనిమిదో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం స్వామివారిని నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు భాను నంబూద్రి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి ఆశీస్సులు అందచేశారు. ఈ సందర్భంగా వెంకట్రామ్ ను అయ్యప్ప క్షేత్ర వ్యవస్థాపకులు అన్నవరపు పాండురంగారావు గురుస్వామి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడిపాముల కష్ణకుమారి, కమిటీ పెద్దలు ఆకుల పథ్వి, యర్రంశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అవయవదాత కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-అవనిగడ్డ : పెదకళ్ళేపల్లి దుర్గా నాగేశ్వర స్వామి ఆలయంలో పనిచేస్తున్న అవనిగడ్డకు చెందిన బచ్చు ప్రదీప్ ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. ప్రదీప్ చేసిన అవయవదానంతో ఎనిమిది మంది జీవితాల్లో వెలుగు నింపింది. ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ప్రదీప్ కుటుంబాన్ని మంగళవారం పరామర్శిం చారు. ఈ సందర్భంగా ప్రదీప్ చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ప్రదీప్ మతికి ప్రగాఢ సంతాపం తెలుపుతూ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే సానుభూతి తెలిపారు.

ఆస్పత్రిలో రోగులకు అల్పాహారం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణంలో దేవినేని వెంకటరమణ ఏరియా హాస్పిటల్‌లో అన్ని విభాగాల్లోని రోగులకు 40 రోజులు పాటు అల్పాహారం పంపిణీ చేయనున్నట్లు తాళ్లూరు చారిటబుల్ ట్రస్ట్ యాజమాన్యం తాళ్లూరి అరుణ తెలిపారు.స్థానిక హాస్పిటల్ లో అల్పాహారం పంపిణీ చేస్తామని మొదటి రోజు గోధుమ రవ్వ ఉప్మా, రాగి జావ, కోడిగుడ్డు వాటర్ ప్యాకెట్ ఇస్తున్నామన్నారు.రోజు కి ఒక వెరైటీ అల్పాహారం అన్ని విభాగాలు పేషెంట్లకు 50 మందికి ఇస్తామని తెలిపారు. మొదటి రోజు అల్పాహారాన్ని హాస్పిటల్ అభివద్ధి కమిటీ చైర్మన్ వేపూరి నాగేశ్వరరావు చేతుల మీదుగా అందించారు. తాళ్లూరు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంతో మందికి సహాయ సహకారాలు అందిస్తున్న తాళ్లూరి చారిటబుల్ ట్రస్ట్ వారికి హాస్పటల్ అభివద్ధి కమిటీ తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పటల్ సూపరిండెంట్ సత్యనారాయణ ,డాక్టర్లు, హాస్పటల్ సిబ్బంది తాళ్లూరి పెట్రోల్ బంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

రెండో రోజు ఓపెన్ ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలో రెండో రోజు బుధవారం ఓపెన్ ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పరీక్షల నిర్వహణ 5 కేంద్రాలను ఫ్లైయింగ్ స్కాడ్ సిబ్బంది ముమ్మర తనిఖీలు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసుల కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాట్లు చేశారు. వీరితో పాటు ప్రభుత్వ ఆరోగ్య శాఖ వారు అత్యవసర సేవల కోసం ఎఎన్ఎం, ఆశా వర్కర్లను ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. రెవెన్యూ సిబ్బంది ఓపెన్ పరీక్షా కేంద్రాలను పరిశీలించే విషయంలో ఎక్కడ తారస పడలేదని తెలుస్తోంది. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో రాయవలసిన తొమ్మిదో తరగతి విద్యార్థుల పరీక్షలను పక్కనే ఉన్న చర్చి మిషనరీ స్కూల్లోకి మార్చారు. పరీక్ష హాలులో కొందరికి సమాధానాలు అందాయని, మరి కొందరికి సమాధానాలు అందలేదని విద్యార్థులు ఆవేదనతో పరీక్ష ఫీజులు చెల్లించిన నిర్వాహకుల మీద రోడ్డు వెంబడి బహిరంగంగానే అటుగా వెళ్ళే వారు చూస్తుండగానే వాదోపవాదనలు చేసుకున్న దృశ్యం తారసపడింది. పోలీసులు జోక్యంతో వారు సర్దుకున్నారు.


దాతను సన్మానిస్తున్న ఎంఎల్ఎ వసంత కృష్ణ ప్రసాద్, తదితరులు

కొండపల్లి మున్సిపాలిటీకి రిక్షాలు బహూకరణ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి మున్సిపాలిటీ అభివద్ధికి తోడ్పాటును అందిస్తున్న దాతల సేవలు అభినందనీయమని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. కొండపల్లికి చెందిన ప్రముఖ వ్యాపారి దాత దామెర్ల లక్ష్మీకాంతారావు రూ.1.50 లక్షల విలువైన చెత్తను తరలించే 5 రిక్షాలను కొండపల్లి మున్సిపాలిటీకి వితరణ చేశారు. వీటిని శాసనసభ్యులు కష్ణప్రసాదు బుధవారం కొండపల్లి మున్సిపాలిటీకి అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ కృష్ణ ప్రసాదు మాట్లాడుతూ వ్యాపారులు, ప్రముఖులు ఇటువంటి సేవా కార్యక్రమాలకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దాత లక్ష్మీ కాంతారావును ప్రత్యేకంగా అభినందించారు. కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన ఇన్చార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), ఎన్డీఏ కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్షా సామాగ్రి వితరణ

ప్రజాశక్తి - గంపలగూడెం : మండలంలోని నెమలి ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన సామాగ్రి, వైట్‌నోట్ బుక్స్ ఆ గ్రామానికి చెందిన దార రవికుమార్ దంపతులు అందజేసినట్లు పాఠశాల హెచ్ఎం డి.చంద్రం తెలిపారు.



పన్నులు సకాలంలో చెల్లించాలి : మున్సిపల్ కమిషనర్

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మున్సిపల్ పరిధిలో ఇంటి పన్నులు, నీటి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు, వ్యాపార లైసెన్సులు, ప్రకటన ఛార్జీలు సకాలంలో చెల్లించాలని నందిగామ మున్సిపల్ కమిషనర్ రమణబాబు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నందిగామ పట్టణము నందు ప్రస్తుతము రూ.4 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. నందిగామ పురపాలక సంఘం సంబంధించి 2024-2025 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను డిమాండ్ 5.56 కోట్లుగా ఉందని తెలిపారు. నందిగామ పురపాలకసంఘు ఆర్థిక పరిస్థితి మెరుగ్గా లేనందున నందిగామ పట్టణాన్ని అవసరమైన మేరకు అభివృద్ధి చేసేందుకు చాలా ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ఆస్తి పన్ను డిమాండ్ 5.56 కోట్లు కాగా ఇప్పటివరకు 2.70 కోట్లు మాత్రమే, ఇప్పటివరకు చెల్లింపు అయ్యాయని, ఇంకనూ 2.86 కోట్లు వసూలు కావలసిఉందని పేర్కొన్నారు. ఖాళీ స్థల పన్ను డిమాండ్ 73 లక్షలు కాగా, అందులో 12 లక్షలు మాత్రమే ఇప్పటివరకు చెల్లింపు జరిగిందని, ఇంకనూ 61 లక్షలు వసూలు కావలసి ఉందని పేర్కొన్నారు. నీటి పన్ను డిమాండ్ 2.26 కోట్లు కాగా, 39 లక్షలు మాత్రమే ఇప్పటివరకు వసూలు కాగా, ఇంకనూ 1.87 లక్షలు రావాల్సి ఉందని తెలిపారు. పన్ను చెల్లింపుదారులు సకాలంలో పన్ను చెల్లించి పట్టణ పారిశుధ్యం, వీధి దీపాలు, నీటి సరఫరా మొదలగు మెరుగైన సేవలు అందించటంలో వార వంతు సహకారం అందించాలని కమిషనర్ కోరారు.


పర్యటిస్తున్న కొలికపూడి

ఎంఎల్ఎ కొలికపూడి పర్యటన

ప్రజాశక్తి - విస్సన్నపేట : క్రైస్తవుల ఉపవాస దినాల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఎ కొలికపూడి శ్రీనివాసరావు మండలంలో బుధవారం పర్యటించారు. స్థానిక సిలువ గట్టులో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం రైతన్నలకు అండగా రైతులందరూ బాగుండాలని ప్రతి ఒక్కరు వారు పండించే పంటను సంతోషంగా పండించుకోవడానికి అవసరమైన సాగునీరు ప్రధాన సమస్యని రైతులు తెలపగా వెంటనే స్పందించి ఆంధ్ర తెలంగాణ సరిహద్దులో గల విసన్నపేట మండలం మూర్తిపాడు గ్రామంలో 102వ రెగ్యులేటర్ ఎడమ కాలువ వద్ద ఏర్పాటుచేసిన లాకులను పరిశీలించారు. సమస్యను పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని కాలవ సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు.

రైతుబజార్‌లో తనిఖీ

ప్రజాశక్తి - కంచికచర్ల : రైతు బజార్‌లో నిర్ణయించిన ధరలకంటే ఎక్కువ ధరలకు కూరగాయలు విక్రయిస్తే స్టాల్ నిర్వాహకుల గుర్తింపు కార్డు రద్దు చేస్తామని ఇన్చార్జి తహశీల్దార్ మానస హెచ్చరించారు. కంచికచర్ల రైతు బజార్‌ను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి స్టాల్‌ను సందర్శించి గుర్తింపు కార్డులు తనిఖీ చేశారు. బోర్డుపై నిర్ణయించిన ధరలకే కూరగాయలు విక్రయించాలన్నారు. రైతు బజార్ సిబ్బంద్ ఎప్పటికప్పుడు ధరల పట్టికను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్లమంలో ఎస్టేట్ అధికారి అజయ్‌పాల్గొన్నారు.


రైతు బజారు తనిఖీ చేస్తున్న తహశీల్దార్ మానస

మహిళా దినోత్సవ వారోత్సవాలు

ప్రజాశక్తి - నందిగామ : ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఇన్చార్జి సిడిపిఒ కృష్ణకుమారి ఆధ్వర్యంలో నందిగామ మండలంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం, మాగల్లు లింగాలపాడు, నందిగామ సెక్టార్లలోని అంగన్వాడీ కేంద్రాల్లో హ్యాపీ ఉమెన్-హెల్తీ ఉమెన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం గర్భిణీలు బాలింతలకు అందజేసే సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సిడిపిఒ కృష్ణకుమారి పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు బరువు ఎత్తు, తల్లులకు పోషకాహార కిట్లను అందజేశారు. చిరుధాన్యాలతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల ప్రతి ఒక్కరు పరిపూర్ణ ఆరోగ్యం ఆనందాన్ని పొందొచ్చని సూపర్వైజర్లు కరుణకుమారి, వెంకట రావమ్మ, తారబీ పేర్కొన్నారు. ఆయా కేంద్రాల్లో జరిగిన కార్యక్రమాల్లో అంగన్వాడి వర్కర్లు గర్భిణీలు బాలింతలు తల్లులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట :** పట్టణంలోని వాగ్దేవి కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం చిల్లకల్లు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ లక్ష్మీ భార్గవి ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్కిల్ ట్రైనింగ్ ఒకేషనల్ కోర్సెస్ గురించి కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ మాట్లాడుతూ ఆడపిల్లలు ఈ వోకేషనల్ కోర్సులు స్కిల్ కోర్సులు చదవటం వల్ల రెండు సంవత్సరాల్లోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు 100శాతం పొందొచ్చని వివరించారు. వాగ్దేవి కళాశాలలో ఎంపిహెచ్ డబ్ల్యు నర్సింగ్, ఎంఎల్‌టి, ల్యాబ్ టెక్నీషియన్, వెటర్నరీ సైన్స్, కంప్యూటర్ సైన్స్ వంటి ఒకేషనల్ కోర్సులను ప్రభుత్వం అందించే ఫీజు రియంబర్స్మెంట్‌తో అందజేయనున్నట్లు 100శాతం ఉద్యోగ ఉపాధి అవకాశాన్ని కళాశాల తరపున ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ కె.ఉషారాణి, ఎస్‌కె బిబి జాన్, కె.సువర్ణ, శారద, విద్యార్థులు పాల్గొన్నారు. **తిరువూరు :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తిరువూరు చైతన్య పాఠశాలలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలను పోలీస్ సిబ్బంది బుధవారం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ఎస్ఐ సత్యనారాయణ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ లక్ష్మి, ఎంఎస్ కె.విజయలక్ష్మి, చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ ఇబ్రహీం, సిబ్బంది పాల్గొన్నారు.


నందిగామ అంగన్వాడీలో పిల్లల ఎత్తు, బరువులు పరిశీలిస్తున్న మండవ కృష్ణకుమారి


తిరువూరులో విద్యార్థులకు బహుమతులందజేస్తున్న దృశ్యం

స్థానిక సమస్యలు వివరించిన ఎంఎల్‌ఎలు

అడవి ఆవుల బారి నుంచి పంటలను కాపాడండి : ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య

జగ్గయ్యపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి : ఎంఎల్ఎ శ్రీరాం రాజగోపాల్

బుడమేరు గండ్లను శాశ్వతంగా యుద్ధప్రాతిపదికన పూడ్చాలి:- ఎంఎల్ఎ వసంత


ఎంఎల్ఎ సౌమ్య


వసంత కృష్ణ ప్రసాద్


శ్రీరాం రాజగోపాల్

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ నియోజకవర్గంలో అడవి ఆవుల బారి నుంచి రైతాంగ పంటలను ఆదుకోవాలని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలలో బుధవారం ఏపీ ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య మాట్లాడుతూ నియోజకవర్గంలోని చందర్లపాడు మండల ప్రాంతంలో నది పరివాహక గ్రామాల లంక పొలాలలో ఎక్కువగా అడవి ఆవులు సంచరిస్తున్నాయని తెలిపారు. పగటి వేళలలో విశ్రాంతి తీసుకుంటూ రాత్రి వేళలలో చిన్న, సన్నకారు రైతులు సేద్యం చేస్తున్న పంట పొలాలపై గుంపులు గుంపులుగా పడి పంటలను నాశనం చేస్తున్నాయని తెలిపారు. గుంపులుగా ఉన్న ఈ ఆవులు మనుషులపై దాడికి తెగబడుతూ వారి ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం కూడా ఉందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని సంబంధిత మంత్రి దృష్టికి తీసుకువెళ్లి తక్షణమే వీటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. **జగ్గయ్యపేట :** జగ్గయ్యపేటలో ప్రభుత్వ స్థలాలు ఉన్నాయి ఆ స్థలాలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అన్నారు. శాసనసభ సమావేశాలలో బుధవారం జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మాట్లాడుతూ పేదలకు ఉన్నత చదువుల కోసం డిగ్రీ కళాశాల అందుబాటులోకి తేవాలి. పేద విద్యార్థుల చదువుల కోసం గతంలో ఎస్ జి ఎస్ కళాశాల 50 సంవత్సరాల నుండి అందుబాటులో ఉంది అని తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో ఆ కళాశాలను ప్రైవేట్ కళాశాలగా మార్చారన్నారు. గతంలో వివిధ రకాలుగా బిల్డింగులు ప్రభుత్వపరంగా నిర్మించినట్లు తెలిపారు. జగ్గయ్యపేట పట్టణ ప్రాంతంలో ప్రభుత్వ స్థలాలు ఉన్నాయని ఈ స్థలాల్లో ఒకదానిని ఎంపిక చేసి పేద విద్యార్థుల చదువు కోసం డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. **ఇబ్రహీంపట్నం :** బుడమేరు ఆధునికీకరణ పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టి, శాశ్వతంగా గండ్లను పూడ్చాలని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కష్ణప్రసాదు పేర్కొన్నారు. గత ఏడాది ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో వచ్చిన అకాల వర్షాలకు బుడమేరు వల్ల సంభవించిన వరదలు, విధ్వంసం కారణంగా సామాన్య జనజీవనం స్తంభించి, రైతులు, ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. బుడమేరు 75 శాతం మైలవరం నియోజకవర్గంలో ఉందన్నారు. వరదల ధాటికి మైలవరం నియోజకవర్గంలో 60కి పైగా చెరువుల కట్టలు తెగిపోయాయన్నారు. ఇప్పటికీ పూర్తి స్థాయిలో చెరువులకు మరమ్మతులు చేపట్ట లేదన్నారు. భవిష్యత్తులో కేవలం 10 సెంటి మీటర్ల వర్షపాతం నమోదు అయినా గతానికి మించిన విధ్వంసం జరిగే అవకాశం ఉందన్నారు. బుడమేరు ఆధునికీకరణకు నిధులు కేటాయించి తక్షణమే పనులు చేపట్టాలని కోరారు.

హోంగార్డు కుటుంబానికి సాయం

ప్రజాశక్తి-విజయవాడ : నగర పోలీసు కమిషనర్ ఎస్‌వి రాజశేఖర్‌బాబు చేతుల మీదుగా ఇబ్బందుల్లో ఉన్న హెూమ్‌గార్డ్ రాజేష్ కుటుంబానికి రూ. లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. స్థానిక సూర్యాపేట పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న హెూంగార్డు రాజేష్ కుమారుడు (10 సం.) గత నెల 26వ తేదీన ఇంటిలో బాత్రూమ్ లోకి వెళుతూ అనుకోకుండా వేడి నీళ్ళ కోసం పెట్టిన వాటర్ హీటర్ మీద పడిపోవడంతో బాలుడి మర్మాంగం వద్ద తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే దగ్గర లోని ఆసుపత్రిలో జాయిన్ చేసి చికిత్స అంధిస్తున్నారు. సదరు సంఘటనపై బాలుడి మెరుగైన వైద్యం కోసం హెూంగార్డు కుటుంబానికి ఆర్థిక సహాయంగా పోలీసు కమిషనర్ వారి వెల్ఫేర్ ఫండ్ నుండి రూ.25 వేలు అడ్మిన్ డి.సి.పి. కె.జి.వి.సరిత, పరిపాలనా సిబ్బంది కలిసి 50 వేలు, ఎన్.టి.ఆర్. జిల్లా పోలీసు గ్రూప్ ల నుండి రూ.25 వేలు మొత్తం ఒక లక్ష రూపాయలను బుధవారం పోలీసు కమిషనర్ కార్యలయంలో నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు చేతుల మీధుగా హెూంగార్డు రాజేష్ కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డి.సి.పి. కె.జి.వి.సరిత , హెూంగార్డు ఆర్.ఐ. శ్రీ కె.సుధాకర రెడ్డి , ఎన్.టి.ఆర్ జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం. సోమయ్య , పరిపాలనా విభాగ అసోసియేషన్ ప్రెసిడెంట్ గంగాధర్ గారు, అసోసియేషన్ సంఘ సభ్యులు జి శేషారత్నం , జి కళ్యాణి , ఏవీఎన్ఎస్ కళ్యాణి , ఆనంద్ , బుచ్చయ్య , శ్రీనివాస్ పాల్గొన్నారు.



అద్దంకి నాంచారమ్మ జాతర మహోత్సవం

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి మండలంలోని పెదప్రోలు గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు బాచు శ్రీనివాసరావు గహం వద్ద అద్దంకి నాంచారమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అద్దంకి నాంచారమ్మ అమ్మవారి వార్షిక జాతర మహెూత్సవంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ పూజలు అందుకుంటున్న అమ్మవారు బుధవారం బాచు శ్రీను గహానికి రావడంతో చలపల్లి సిఐ ఈశ్వరరావు, మోపిదేవి ఎస్ఐ ఎలుగుబంటి వీర వెంకట సత్యనారాయణ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెల్లూరి శ్రీనివాస్ అర్చకత్వంలో ఎస్ఐ దంపతులు అమ్మవారికి కుంకుమ పూజ చేశారు. పిఎసిఎస్ మాజీ చైర్మన్ ఆది రాంబాబు, ఆకుల అజయ్ కుమార్, జనసేన పార్టీ నాయకులు పరుచూరి సాయి, యన్నం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అమ్మ వారు డప్పు వాయిద్యాల నడుమ ఇంటింటికీ తిరుగుతూ, పూజలు అందుకున్నారు. ఆలయ కమిటీ కార్యదర్శి కూరపాటి కోటేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రహదారి సమస్యను పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనగడ్డ-కోడూరు ప్రధాన రహదారి సమస్యను పరిష్కరించాలని కోరుతూ చీఫ్ ఇంజనీర్ నయీములను ప్రముఖ పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్ కలిశారు. ఈ మేరకు ఆయన విలేకరులతో మాట్లాడుతూ అమరావతిలోని చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలో నయీములను కలసి రహదారిపై చర్చించినట్లు విక్కుర్తి తెలిపారు. రహదారి సరిగ్గా లేకపోవడం వల్ల కోడూరు మండల ప్రజలు పడుతున్న అవస్థలను వివరించినట్లు తెలిపారు. రోడ్డు కాంట్రాక్టర్కు చీఫ్ ఇంజనీర్ ఫోను చేసి వెంటనే రోడ్డు పనులు ప్రారంభించాలని సూచించారన్నారు. .

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన

ప్రజాశక్తి-చల్లపల్లి : ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని చల్లపల్లి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీనియర్ మేనేజర్ పి. వెంకటరావు అన్నారు. బుధవారం స్థానిక పెదకళ్లపల్లి రోడ్డు లోని శ్రీ వివేకనంద డిగ్రీ కళాశాలలో వర్క్ షాప్ సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన రిజర్వ్ బ్యాంక్ అఫ్ ఇండియా, డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ వర్క్ షాప్ లో ముఖ్య అతిథి గా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే ఆర్థికపరమైన క్రమశిక్షణ కలిగి ఉండాలని పొదుపులను అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విశిష్టతను కళాశాల ప్రిన్సిపల్ పి సురేష్ బాబు విద్యార్థులకు వివరించారు. ఇండియన్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ ప్రశాంత్ నాగు, ప్రాజెక్టు డైరెక్టర్ వి.ఆంజనేయులు, ప్రాజెక్ట్ మేనేజర్ వి.అశోక్ కుమార్ పర్యవేక్షించారు.

పొలాల్లో నీటి కుంటలు గుర్తించాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - గుడివాడ : రైతుల పొలాల్లో పంట నీటికుంటలను గుర్తించాలని గుడివాడ మండల పరిషత్ అభివృద్ధి అధికారి బివై విష్ణు ప్రసాద్ ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశపు మందిరంలో ఫీల్డ్ అసిస్టెంట్స్‌కి రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విష్ణు ప్రసాద్ మాట్లాడుతూ నీటి కుంటలను గుర్తించి వెంటనే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను నిర్వహించా లన్నారు. అలాగే ఎన్‌ఆర్‌ఇజిఎస్‌లో వివిధ పథకాల గురించి, గోకుల షెడ్లు నిర్మాణాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎపిఓ దేవానంద రాజు, గుడివాడ మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో బివై విష్ణు ప్రసాద్

మంచినీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి-విజయవాడ : వేసవిలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. బుధవారం కృష్ణలంక ప్రాంతంలోని 20, 21, 22 డివిజన్లో పర్యటించి క్షేత్రస్థాయిలోని పరిస్తితులను పరిశీలించారు. 21వ డివిజన్ మెట్ల బజార్ చివరనున్న బోరు పంపు పని చేస్తున్న తీరును కమిషనర్ పరీక్షించారు. వేసవికాలంలో ప్రజలకు తాగునీటి సరఫరా లో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని, అధికారులందరూ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ప్రస్తుతం ఉన్న త్రాగునీటి బోర్లు పనిచేస్తున్నాయా లేదా వంటి విషయాలను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. కష్ణలంకలోని స్వర్గపురిలో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దీనిలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కమిషనర్ ఆదేశించారు. అలాగే స్వర్గపురిలోపల, వెలుపల పరిశుభ్రంగా ఉండాలన్నారు. ప్రజారోగ్య విభాగం అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ శుభ్రంగా ఉంచాలన్నారు. పద్మావతి, కృష్ణవేణి ఘాట్లను పరిశుభ్రంగా ఉంచాలని, ఎప్పటికప్పుడు వాటిల్లో కార్మికులతో ఊడిపించాలన్నారు. ఏవైనా మరమ్మతులు ఉన్నచో వెంటనే వాటిని రిపేరు చేయించాలన్నారు. అనంతరం ఏపీఎస్ఆర్ఎం స్కూల్ సమీప అన్న క్యాంటీన్ ను పరిశీలించి, దానిని కూడా పరిశుభ్రంగా ఉంచడంతో పాటు భోజన ఏర్పాట్లు బాగుండేటట్లు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరిండెంటింగ్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్) పి. సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం పాల్గొన్నారు.



లంకేశ్వరమ్మ మృతికి సంతాపం



ప్రజాశక్తి-అవనిగడ్డ : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి, గ్రామ మాజీ ఉపసర్పంచ్ గాజుల జయ గోపాల్ మాతమూర్తి గాజుల లంకేశ్వరమ్మ(58) మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. లంకేశ్వరమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీనితో ఆరోగ్యం క్షమించి మంగళవారం రాత్రి మృతిచెందారు. లంకేశ్వరమ్మ మృతికి వైసిపి నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతి దేవి, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, గ్రామ సర్పంచ్ గో రుముచ్చు ఉమా, పలువురు వైసిపి నాయకులు లంకేశ్వరమ్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు

ప్రజాశక్తి-నందివాడ : నందివాడ గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో మహిళా దినోత్సవ వేడుకల సందర్భంగా విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని మహిళల సాధికారత, హక్కులు, సమానత్వం వంటి కీలక విషయాలపై తమ అభిప్రాయాలను వ్యాస రూపంలో వ్యక్తపరిచారు. విద్యార్థులకు మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించి, సమాజంలో మహిళల పాత్ర, రక్షణ, హక్కుల గురించి అవగాహన కల్పించడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మహిళల రక్షణ కొరకు అభయ మహిళా రక్షక దళ సభ్యులు సేవలు ఉపయోగించడం, అత్యవసర సమయంలో పోలీసులను సంప్రదించడానికి డయల్ 112 హెల్ప్ లైన్ నెంబరు వంటి విషయాలపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు.

పవన్ కళ్యాణ్‌పై వ్యాఖ్యలకు ఖండన

ప్రజాశక్తి-అవనిగడ్డ : మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని జనసేన జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్ హితవు పలికారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజకీయాల్లో నైతిక విలువలే ఊపిరి అని, అవి జగన్మోహన్రెడ్డిలోని లోపించాయని విమర్శించారు. జగన్ తక్షణమే పవన్ కళ్యాణ్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబుకు ఘన స్వాగతం

ప్రజాశక్తి-కంకిపాడు : పెనమలూరు శాసన సభ్యులు బోడె ప్రసాద్ కుమారుడు వెంకట్‌రామ్ వివాహ రిసెప్షన్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం హాజరయ్యారు. పెనమ లూరు మండలం పోరంకిలోని బోడే ప్రసాద్ గహానికి చేరుకొని నూతన వధూవరులు వెంకట్‌రామ్, రీతికలకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపి వారికి ఆశీస్సులు అందించారు. అలాగే నూతన వధూవరులను రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి, కొల్లు రవీంద్రలు ఆశీర్వదించారు. తొలుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డిఐజి అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ ఆర్. గంగాధర్ రావులు ఘన స్వాగతం పలికారు.



వధూవరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ముఖ్యమంత్రి

బ్యాంకు ఖాతాల్లో నగదు కట్

- సమాధానం చెప్పని అధికారులు
- అయోమయంలో ఖాతాదారులు

ప్రజాశక్తి-గన్నవరం : అతని పేరు సీతారామరాజు. చాలా కాలం నుంచి గన్నవరం రాయనగర్ స్టేట్ బ్యాంకులో ఖాతా ఉంది. బుధవారం ఒక్కసారిగా బ్యాంకు ఖాతాలో 3000 కట్ అయినట్టుగా మెసేజ్ వచ్చింది. ఎందుకు డబ్బులు కట్ అయినయో అర్థం కాక బ్యాంకుకి వెళ్ళాడు. మేనేజర్ దగ్గరకు వెళదామంటే సిబ్బంది పెళ్ళనియలేదు. అసిస్టెంట్ మేనేజర్ దగ్గరకు వెళ్లి అడిగితే.. ఒక కాగితం తీసి చేతులో పెట్టి అది చూసుకోండి.. అని సమాధానం ఇచ్చారు. మాకు ఏమీ అర్థం కావడం లేదని సీతారామరాజు అడగ్గా? మాకు తెలియదు.. ఖాతాలో వచ్చిన రిపోర్టు మీకు ఇచ్చాం.. ఎందుకు డబ్బులు కట్ అయినయో ఆ దేవుడిని అడగాలి అంటూ జవాబిచ్చారు. అదేమని అతను గట్టిగా అడగా మీ చేతనైంది చేసుకోండి అనే సమాధానం వచ్చింది. ఈ తంతు జరిగే లోపు 20 మంది పోగయ్యారు. మా ఖాతాలో డబ్బులు కట్ అయ్యాయని గొడవ చేశారు. ఒక్కొక్కరి ఖాతాలో 600 నుంచి 2వేలు , 3 వేలు ,6000 వరకు కట్ అయినట్లుగా మెసేజ్లు వచ్చాయని, మా డబ్బులు ఏమయ్యాయి అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకు అధికారులు మాకు తెలియదు అంటూ తెల్ల మొహం వేశారు. ఇది గన్నవరం స్టేట్ బ్యాంకులో నెలకొన్న పరిస్థితి. ఖాతాలో డబ్బులు మాయమైపోవడంతో వినియోగదారులు బ్యాంకులకు వెళ్లి లబోదిబోమంటూ అధికారుల నిలదీశారు. కాగితం రాసి ఇవ్వండి? పైన అడిగి మీకు సమాధానం ఇస్తామంటూ చెప్పి కాగితాలు రాయించుకున్న పరిస్థితి వచ్చింది. ఖాతాల్లో డబ్బులు ఎందుకు కట్ అవుతున్నాయో ఎవరికి అర్థం కావడం లేదు. బ్యాంకులో ఇచ్చి రిపోర్టు కాగితం చూస్తే అంతా గందరగోళంగా ఉంది. నిజం చెప్పాలంటే ఆ కాగితం బ్యాంకు వాళ్ళకి అర్థం కావడం లేదు. ఇది ఒక సీతారామరాజు కథే కాదు. ఇలా చాలామంది ఉన్నారు. బ్యాంకు మేనేజర్‌కు హిందీ తప్ప తెలుగు రాదు. ఆయన దగ్గరకు వెళ్లినా సమాధానం రాదని అంటున్నారు. ఇప్పటికైనా స్టేట్ బ్యాంక్ ఉన్నతాధికారులు కట్ అవుతున్న డబ్బులపై విచారణ చేసి తగిన సమాచారం ఇవ్వాలని ఖాతాదారులు కోరుతున్నారు.

రక్తదాన శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ : సమత సైనిక్ దళ్ స్టేట్ ప్రెసిడెంట్, హైకోర్టు న్యాయవాది పాలేటి ఉమా మహేశ్వరరావు (పింకీ) జన్మదిన వేడుకల్లో ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. మంగళవారం లోటస్ ల్యాండ్ మార్క్ లో పాలేటి ఉమా మహేశ్వరరావు నివాసం వద్ద జరిగిన జన్మదిన వేడుకలకు హాజరైన ఎంపి కేశినేని శివనాథ్ కు పాలేటి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం పాలేటి ఉమా మహేశ్వరరావు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎంపీ కేశినేని శివనాథ్ ప్రారంభించారు. రక్తదానం చేసిన దాతలను ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) అభినందించి పండ్లు పంపిణీ చేశారు.

విజయవాడ వాసికి గోల్డెన్ మెజీషియన్ అవార్డు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విజయవాడకు చెందిన డాక్టర్ గుగాంపునకు గోల్డెన్ మెజీషియన్ అవార్డు రావడం హర్షణీయమని సఫయికర్మ చారి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శిఖరం కీర్తి ప్రకాష్ అన్నారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. విజయవాడలో పుట్టి పెరిగి విదేశాలకు వెళ్లి ప్రపంచ ప్రసిద్ధ ఇంద్రజాలికులుగా, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ పురస్కార గ్రహీతగా పలు అవార్డులను సొంతం చేసుకున్న డాక్టర్ గుగాంపు గోల్డెన్ మెజీషియన్ అవార్డుతో పాటు జీవిత సాఫల్య పురస్కారాన్ని కూడా సొంతం చేసుకోవడం హర్షణీయమని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ ఇంద్రజాల దినోత్సవాన్ని పురస్కరించుకుని గత నెలలో విశాఖపట్నంలో అత్యంత వైభవోపేతంగా జరిగిన ఇండియన్ మ్యాజిక్ అవార్డ్స్ నైట్ కార్యక్రమంలో విజయవాడకు చెందిన డాక్టర్ గుగాంపుకు గోల్డెన్ మెజీషియన్ అవార్డును ఇండియన్ మ్యాజిక్ అకాడమి వ్యవస్థాపక అధ్యక్షులు బిఎస్ రెడ్డి చేతుల మీదుగా అందజేసినట్లు ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపి చిన్ని

రక్తదాన శిబిరం ప్రారంభం

విజయవాడ : సమత సైనిక్ దళ్ స్టేట్ ప్రెసిడెంట్, హై కోర్టు న్యాయవాది పాలేటి ఉమా మహేశ్వరరావు (పింకీ) జన్మదిన వేడుకల్లో ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం లోటస్ ల్యాండ్ మార్క్‌లో పాలేటి ఉమా మహేశ్వరరావు నివాసం వద్ద జరిగిన జన్మదిన వేడుకలకు హాజరైన ఎంపికి పాలేటి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం పాలేటి ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎంపి శివనాథ్ ప్రారంభించారు. రక్తదానం చేసిన దాతలను ఎంపి అభినందించి పండ్లు పంపిణీ చేశారు.

మహిళా ఉద్యోగుల క్రీడా పోటీలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నిత్యం బాధ్యతలతో, కుటుంబ పరమైన ఒత్తిళ్లతో ఉండే మహిళా ఉద్యోగులకు ఆటపాటలు మానసిక ఉల్లాసాన్నిస్తాయని, మరింతగా బాధ్యతగా వ్యవహరించడానికి చురుకుగా పనిచేయడానికి కావలసిన శక్తినిస్తాయని అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఎన్జీజిఓ రాష్ట్ర మహిళా విభాగం నిర్వహిస్తున్న క్రీడలకు పెద్ద ఎత్తున మహిళా ఉద్యోగుల నుంచి స్పందన రావడం ఆనందంగా ఉందని ఏపీజేఏసీ చైర్మన్ ఏపీ ఎన్జీజీవో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి అన్నారు. స్థానిక గాంధీ నగర్ ఎన్జీజీవో హోంలో జరుగుతున్న రెండో రోజు ఉద్యోగుల ఆటలు పోటీల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా ఉద్యోగులకు మానసిక ధైర్యం, ఆహ్లాదకర జీవితం అవసరమని, ఆ శక్తిని ఇటువంటి కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా, సంఘం ద్వారా పొందుతారని తెలిపారు. క్యారమ్స్, చెస్ మరియు వ్యాసరచన పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలలో వివిధ శాఖలకు సంబంధించిన మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. విజయవాడ దండుమూడి రాజగోపాల్ ఇండోర్ స్టేడియంలో జరిగిన షటిల్ బ్యాట్మెంటన్ క్రీడలను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.విద్యా సాగర్ ప్రారంభిం చారు. ఉద్యోగులు, ముఖ్యంగా యువతులు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు.



సిఎ ఇంటర్ ఫలితాల్లో 'గురుకుల్'కు జాతీయ ర్యాంకులు

అకాడమీ డైరెక్టర్లు వెంకటరెడ్డి, వినోద్‌కుమార్ వెల్లడి

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ (విజయవాడ) : ఐసిఎఐ విడుదల చేసిన సిఎ ఇంటర్ ఫలితాల్లో తమ విద్యార్థులు జాతీయ స్థాయిలో మూడు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని గురుకుల్ అకాడమీ డైరెక్టర్లు కాశీ వెంకటరెడ్డి, వినోద్ కుమార్ తెలిపారు. ద్వితీయ ర్యాంకుతోపాటు 29, 47 ర్యాంకులను సాధించారని తెలిపారు. విజయవాడ లబ్బీపేట మసీదు రోడ్లోని గురుకుల్ అకాడమీ కార్యాలయంలో డైరక్టర్లు కాశీ వెంకటరెడ్డి, వినోద్ కుమార్, వెంకట శేఖర్, అరుణ్ కుమార్, సంపత్ రావు సోమవారం మీడియాతో మాట్లాడారు. తమ అకాడమీలో శిక్షణ పొందిన విద్యార్థుల్లో 65 శాతం మంది ఉత్తీర్ణులయ్యారని వివరించారు. దేశంలో ఏ సంస్థ కూడా ఇంతటి ఉత్తీర్ణత శాతం సాధించలేదని, ఇది తమకెంతో గర్వకారణంగా ఉందని అన్నారు. శిక్షణకుతోడు తల్లిదండ్రుల ప్రోత్సాహం తాము ఉత్తమ ర్యాంకులు సాధించడానికి దోహదం చేశాయన్నారు. ఇంతటి విజయాన్ని సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కతజ్ఞతలు తెలిపారు. తమ విద్యార్థులు జాతీయ ర్యాంకులు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ భవిష్యత్తులో కూడా తమ అకాడమీ మరిన్ని ఉన్నత విజయాలను అందుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు మాట్లాడుతూ గురుకుల్ అకాడమీలో ఇచ్చిన స్టడీ మెటీరియల్, పరీక్షకు ముందు అధ్యాపకులు ఏర్పాటు చేసిన పునఃశ్చరణ తరగతులు తాము ర్యాంకులు సాధించేందుకు ఎంతగానో దోహదం చేశాయన్నారు. ఈసందర్భంగా ద్వితీయ ర్యాంకర్ తోట సోమనాథ్ శేషాద్రి నాయుడు, 29వ ర్యాంకర్ ఆర్.సందీప్, 47వ ర్యాంకర్ జేబీ తేజస్విలను అకాడమీ డైరెక్టర్లు ఘనంగా సత్కరించారు.



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో డైరెక్టర్లు

శారద విద్యార్థులకు కోట్లలో విదేశీ స్కాలర్‌షిప్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : తమ కళాశాలలో సీనియర్ ఇంటర్ ఎంపిసి చదువుతున్న ఆదిత్య, కీర్తికా, కౌశిక్‌లు అమెరికాలోని ప్రముఖ యూనివర్శిటీలో ప్రవేశాలు పొందడమే కాకుండా అత్యధికంగా స్కాలర్‌షిప్‌లకు అర్హత సాధించారని శారదా విద్యాసంస్థల ఛైర్మన్ వై.రమేష్ బాబు చెప్పారు. స్థానిక జమ్మిచెట్టు సెంటర్‌లో ఉన్న కళాశాల ఆవరణలో అమెరికా యూనివర్శిటీలో బీటెక్‌లో ప్రవేశాలు పొందిన విద్యార్థులను బుధవారం అభినందించారు. రమేష్‌బాబు మాట్లాడుతూ అమెరికాలోని ప్రముఖ యూనివర్శిటీ అయినా మిల్వాకీ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ యూనివర్శిటీలో (ఎంఎస్‌వోఈ)లో మిరియాల ఆదిత్య బీటెక్‌లో ప్రవేశం పొందడమే కాకుండా సంవత్సరానికి రూ.2 కోట్ల 40 లక్షల స్కాలర్‌షిప్‌ను పొందాడని చెప్పారు. పాతూరి కీర్తికా అనే విద్యార్థి కీల్లాయ్ స్కూల్ ఆఫ్ బిజినెస్ యూనివర్శిటీలో ప్రవేశంతో పాటు పదివేల డాలర్ల స్కాలర్‌షిప్‌ను కూడా పొందిందని చెప్పారు. చెరుకూరి కౌశిక్ ఎంఎస్ఒఇ యూనివర్శిటీలో బీటెక్‌లో ప్రవేశంతో పాటు రూ.1 కోటి 2 లక్షల స్కాలర్‌షిప్‌ను అర్హత పొందాడని వివరించారు. శారదా విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వై.శారదాదేవి మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యను ప్రామాణికంగా తీసుకుని తాము ఏర్పాటు చేసిన శాట్ ప్రోగ్రామ్ ద్వారా శిక్షణ తీసుకున్న విద్యార్థులు విదేశీ యూనివర్శిటీల్లో ప్రవేశాలు, ఉపకారవేతనాలు పొందడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఇన్విక్టా అనే సంస్థలో తాము భాగస్వాములను చేసుకుని ప్రత్యేకమైన శాట్ ప్రోగామ్‌ను విద్యార్థులను అందిస్తున్నామని ఆమె చెప్పారు. కళాశాల సలహాదారుడు ఈఎస్‌ఆర్‌కే.ప్రసాద్, జనరల్ మేనేజర్ జీవీ.రావుతో పాటుగా అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.



స్కాలర్‌షిప్ సాధించిన విద్యార్థులతో చైర్మన్ రమేష్, తదితరులు

అగ్ని ప్రమాదంలో సుబాబుల్ తోట దగ్ధం

ప్రజాశక్తి - కంచికచర్ల : ప్రమాదవశాత్తు నిప్పంటుకొని 5 ఎకరాల సూబాబుల్ తోట దగ్ధమైన సంఘటనలో సుమారు 5 లక్షల మేర ఆస్తి నష్టం జరిగింది. సేకరించిన సమాచారం మేరకు కంచికచర్ల మండలం గొట్టుముక్కల గ్రామ పరిధిలో బుధవారం మధ్యాహ్నం అగంతకుడు సిగరెట్ వెలిగించి కింద పడేయటంతో గ్రామానికి చెందిన ఆలోకం శ్రీనిశాసరావు, వేణుకు చెందిన 3.5 ఎకరాల సుబాబులు తోటకు నిప్పంటుకుంది. ఈ ప్రమాదంలో మంటలు ఎగిసి పడి తోట పూర్తిగా దగ్ధమైంది. కంచికచర్ల అగ్నిమాపక వాహనం అందూబాటులో లేకపోవటంతో నందిగామ నుండి అగ్నిమాపక వాహనం, సిబ్బంది వచ్చేసరికి సుబాబులు తోట పక్కనే ఉన్న ఖాళీ పొలంలో చెత్తా చెదారానికి కూడా నిప్పం టుకుంది. సంఘటనా స్థలానికి చెరుకున్న ఫైర్ సిబ్బంది మంట లను అదుపు చేశారు. సుబాబుల్ తోట పూర్తిగా దగ్ధమైన సంఘ టన లో రూ.5 లక్షల మేర ఆస్తి నష్టమైనట్లు ఫైర్ సిబ్బంది తెలిపారు.



రెడ్‌క్రాస్ సేవలను విస్తరించాలి

రాష్ట్ర అధ్యక్షులు రామారావు పిలుపు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రజలకు సేవలు అందించే విషయంలో ఎన్టీఆర్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని రెడ్ క్రాస్ స్టేట్ చైర్మన్ రామారావు సూచించారు. ఇప్పటికే విభిన్న కార్యక్రమాలు చేపడుతూ ముందుకెళుతున్న ఎన్టీఆర్ జిల్లా రెడ్ క్రాస్ మరిన్ని వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆయన కోరారు. ఎన్టీఆర్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ సమావేశం బుధవారం విజయవాడలో డాక్టర్ సమరం అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి రామారావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ముఖ్యంగా ప్రజల ప్రాణాలకు అవసరమైన రక్తదానాన్ని అందించే విషయంలో ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించడానికి కృషి చేయాలన్నారు. యువతకు హెల్త్ అవేర్నెస్ కార్యక్రమాలు, స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. డాక్టర్ సమరం మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఇప్పటికే వినూత్నమైన కార్యక్రమాలు చేపడుతూ ప్రజలకు ఎన్నో సేవలు అందిస్తుందని వివరించారు. వరదల్లోనూ, కరోనా సమయంలోను రెడ్ క్రాస్ సొసైటీ అందించిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షులు రామచంద్రరాజు, డాక్టర్ వెలగా జోషి పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన డాక్టర్ సమరం, చైర్మన్ రామారావు, తదితరులు

మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులదే బాధ్యత

ప్రజాశక్తి - నందిగామ : మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులే బాధ్యత వహించాలని నందిగామ ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ అన్నారు. బుధవారం స్థానిక మధిర రోడ్డులో ఇంటర్ విద్యార్థులు రాష్ డ్రైవింగ్ చేస్తూ త్రిబుల్ డ్రైవ్ కాకుండా నలుగురిని ఎక్కించుకొని ఒకే బైక్ పై రావడాన్ని గమనించిన ఆయన వెంటనే వారిని నిలువరించి వారికి పలు సూచనలు చేశారు. పలువురికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు నడిపిన, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన,ర్యాష్ డ్రైవింగ్ చేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని సూచించారు. మైనర్లకు వాహనాలు అందించే తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌కు రావాల్సి ఉంటుందని ప్రతిరోజు పరిశీలన చేస్తానని అన్నారు. కాలేజీలు నందిగామ పట్టణ పరిధిలోని పలు ప్రాంతాలలో గస్తీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా నిబంధనలు అధిగమిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శామ్‌కో మ్యూచువల్ ఫండ్ లార్జ్ క్యాప్ ఎన్‌ఎఫ్‌ఓ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : లార్జ్-క్యాప్ స్టాక్స్‌లో ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ స్కీమ్ 'శామ్‌కో లార్జ్ క్యాప్ ఫండ్'కి సంబంధించిన న్యూ ఫండ్ ఆఫర్‌ను (ఎన్‌ఎఫ్‌వో) శామ్‌కో అసెట్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ ఆవిష్కరించిందని సంస్థ సిఇఒ విరాట్ గాంధీ ఒక ప్రకటనలో తెలిపారు. మార్చ్ 5 నుంచి మార్చ్ 19 వరకు ఈ ఎన్‌ఎఫ్‌వో సబ్‌స్క్రిప్షన్ల కోసం అందుబాటులో ఉంటుందన్నారు. 100 లార్జ్ క్యాప్ కంపెనీలతో వైవిధ్యమైన పోర్ట్‌ఫోలియోను నిర్మించడం ద్వారా దీర్ఘకాలికంగా పెట్టుబడుల వృద్ధి ప్రయోజనాలను అందించాలనేది ఈ ఫండ్ లక్ష్యమన్నారు. ఈ అవకాశాలను అందిపుచ్చుకునే దిశగా శామ్‌కో లార్జ్ క్యాప్ ఫండ్‌ను ఆవిష్కరించేందుకు ఇదే సరైన తరుణమన్నారు. క్షీణత రిస్కులను అధిగమిస్తూ, వృద్ధి అవకాశాలను అందిపుచ్చుకోవడం ద్వారా దీనితో ఇన్వెస్టర్లు ప్రయోజనం పొందగలరని శామ్‌కో అసెట్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో విరాజ్ గాంధీ తెలిపారు. నిరాలీ భన్సాలీ, ఉమేశ్‌కుమార్ మెహతా, ధవళ్ ఘన్‌శ్యామ్ ధనానీ సంయుక్తంగా ఈ ఫండ్‌ను నిర్వహిస్తారన్నారు. ఫండమెంటల్, ముమెంటం ఆధారిత ఇన్వెస్టింగ్‌లో వారికి గల అపార ఇన్వెస్టర్లకు గరిష్ట ప్రయోజనాలను చేకూర్చేలా ఫండ్ వ్యూహాలను అమలు చేయడంలో తోడ్పడుతుందన్నారు.

అంగన్వాడీలో ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ డే

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : మైలవరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఈలప్రోలు సెక్టార్ పరిధిలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలలో ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ డే సందర్భంగా సూపర్వైజర్ జి.రమాదేవి అంగన్వాడీ సెంటర్ పరిధిలోని తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏరియాలోని జీరో టు ఫైవ్ వయసు పిల్లలకు బరువులు ఎత్తులు చూచి తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త పద్మ కుమారి, హెల్పర్ విజయ్ లీల పాల్గొన్నారు.